కనులపండువగా కోటి దీపోత్సవం

● విశేష పూజలందుకున్న కామేశ్వరస్వామి


కామేశ్వరాలయం గరుడ పుష్కరిణిలో కోటి దీపాల కాంతులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటివీధిలో వెలసిన లక్ష్మీకామేశ్వరస్వామి దేవాలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం కోటిదీపోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, గణపతిపూజ, స్వస్తి, పుణ్యాహ వచనము, ఏకాదశ వార రుద్రాభిషేకములు, మహా మృత్యుంజయ రుద్ర నవగ్రహ శాంతి హోమాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీకామేశ్వరస్వామి దేవతామూర్తులకు విశేషాలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం ఆలయ ఆవరణలోని గరుణ పుష్కరిణిలో కోటి దీపోత్సవ వేడుకలు కనులపండువగా సాగాయి. విశేష సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక బజారువీధిలోని ఓం శాంతి మందిరంలో మహా శివ లింగం ప్రతిష్ఠ విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త శంకరాచారి, డాక్టర్ శ్రీనివాసులు అర్చకులు గోనవరపు శీనాస్వామి, భక్తులు పాల్గొన్నారు.

గీత దాటొద్దు..

● టీడీపీ అధిష్ఠానం అల్టిమేటం
● మదనపల్లె నాయకులకు క్లాస్
● కలిసి పనిచేయాలని ఆదేశం
● రోడ్డెక్కకుండా.. పార్టీ పటిష్ఠతకు పనిచేయండి...

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): పార్టీ పరువు బజారున పడేవిధంగా ఎవరూ గీత దాటొద్దు.. పత్రికా సమావేశాలు పెట్టవద్దు.. వివాదాలు పెట్టుకుని.. రోడ్డెక్కొద్దు.. ఒకరి విషయాల్లో మరొకరు జోక్యం చేసుకోవద్దు.. ఇద్దరూ కలిసి పార్టీ పటిష్ఠతకు పని చేయండి.. పార్టీ గెలుపుకోసం పనిచేసిన వారిని కలుపుకుని కార్యక్రమాలు చేపట్టండి.. అలా కాదని మరొక్కసారి రోడ్డున పడితే.. ఎంతటి వారైనా చర్యలు తప్పవు. ఇవీ రాష్ట్ర రాజధాని అమరావతిలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాష, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబులకు టీడీపీ అధిష్ఠానం జారీ చేసిన అల్టిమేటం. పార్టీ అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల నుంచే.. ఇరువురు నాయకుల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఇటీవల అవి మరింత తీవ్రమయ్యాయి. ఒకరి మీద మరొకరు పత్రికా సమావేశాలు ఏర్పాటు చేసి ఆరోపణలు చేసుకుంటూ ఉన్నారు.

ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఆదేశాల మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి, అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి, జోన్-4 ఇన్‌చార్జ్ దీపక్‌రెడ్డిల ఆధ్వర్యంలో పార్టీ ఇరువురు మదనపల్లె నాయకులను అమరావతికి పిలిపించింది. రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, ఎమ్మెల్యే షాజహాన్‌బాష, శ్రీరాంచినబాబులు బుధవారం అక్కడికి వెళ్లారు. ఇరువురు నాయకులతో తొలుత


జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావులతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, శ్రీరాంచినబాబు, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

వేర్వేరుగా మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడితోనూ.. విడిగా మాట్లాడి తర్వాత ఇద్దరు నాయకులను కలిపి మాట్లాడారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. రాష్ట్ర నాయకులతో ఎమ్మెల్యే షాజహాన్‌బాష మాట్లాడుతూ శ్రీరాం చినబాబు తనను అన్ని విధాలుగా ఇబ్బంది పెడుతున్నారు.. నియోజకవర్గంలోని కొందరు నాయకులను కలుపుకుని తనకు వ్యతిరేకంగా పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నారు. పత్రికాముఖంగా తనకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ఎన్నికల్లో తనను ఓడించాలని చూశాడు. ఎంతగా కలుపుకోవాలని చూసినా.. కలిసి రావడం లేదు.. అని చెప్పినట్లు తెలిసింది శ్రీరాంచినబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే గెలుపు కోసం ఎంతగానో కష్టపడ్డా.. మమ్మల్ని గుర్తించడం లేదు. మా పనులు ఏమీ చేయడం లేదు. నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం పనిచేసిన సీనియర్ పార్టీ నాయకులను పూర్తిగా పక్కన పెట్టేశారు. కూటమిలో ఉన్న మిత్ర పక్షాలను కూడా పట్టించుకోవడం లేదు. దీంతో నిజమైన కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతుండటంతో కార్యకర్తల తరపున మాట్లాడుతున్నా.. అని చెప్పినట్లు సమాచారం. రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు గత కొన్ని నెలలుగా మదనపల్లె నియోజకవర్గంలో జరిగిన సంఘటనలపై తన పరిశీలనలో వెల్లడైన విషయాలను రాష్ట్ర నాయకులకు చెప్పినట్లు తెలుస్తోంది. వీరందరి అభిప్రాయాలను విన్న రాష్ట్ర అధ్యక్షుడు తదితరులు ఇద్దరినీ కలిపి మాట్లాడారు. ఇప్పటి వరకు జరిగిన సంఘటనలే పార్టీకి ఎంతో నష్టం కలిగించాయి. కార్యకర్తల్లో అయోమయాన్ని ఏర్పరచాయి.

ఇక ఇటువంటి సంఘటనలు జరగకూడదు. ఇద్దరు నాయకులు ఎటువంటి పరిస్థితుల్లోనూ పార్టీ నియమావళికి వ్యతిరేకంగా పత్రికలకు ఎక్కకూడదు. వర్గాలను పెంచి పోషించి రోడ్డున పడకూడదు. ఒకరి వ్యాపారాలు, వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదు. నియోజకవర్గంలో అందరూ కలిసి..పార్టీ పటిష్ఠత కోసం పనిచేయాలి. అలా కాదని వ్యవహరిస్తే..ఎంతటి వారైనా క్రమశిక్షణా చర్యలు తప్పవు.. అని గట్టిగా హెచ్చరించినట్లు సమాచారం. ఇదే సమయంలో త్వరలోనే నియోజకవర్గంలో క్రియాశీల కార్యకర్తలు, నాయకులతో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఈ బాధ్యతను జగన్‌మోహన్‌రాజుకు అప్పగించారు. గత కొన్ని నెలలుగా ఉప్పునిప్పులా ఉన్న ఇరువురు నాయకులను సర్దుకుపొమ్మని అధిష్ఠానం సర్దిచెప్పి పంపించింది. అయితే కొన్ని నెలలుగా జరిగిన సంఘటనల నేపథ్యంలో.. వీరి వర్గీయులు దాడుల వరకు వెళ్లిన పరిస్థితుల్లో.. ఇరువురు నాయకుల మధ్య సయోధ్య.. ఎంత కాలం ఉంటుందో.? వేచి చూడాల్సిందే.

మోటార్ల కేబుల్ ఎత్తుకెళుతున్నారు

● రూ.3 లక్షల విలువైన వైర్లు చోరీ ● మోటార్లు ఆడక ఎండుతున్న పంటలు

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్ల వద్ద ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లిపోతున్నారు. వీటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని రైతులు చెబుతున్నారు. బుధవారం వెంగంవారిపల్లి పంచాయతీ మండెంవారిపల్లి, గండిమాల పల్లి, సైదాపేట తదితర ప్రాంతాల్లో పలువురు రైతులు తమ వ్యవసాయ బోర్ల వద్ద ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను ఎత్తుకుపోయారు. దాదాపు 20 రోజుల నుంచి రాత్రి వేళల్లో వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్లను దొంగలు దోచుకెళుతుండటంతో రాత్రి సమయంలో పొలాల్లోనే రైతులు కాపలా ఉంటున్నారు. కాగా దొంగలు వైర్లు కట్ చేసే సమయంలో బోరు మొదటి వరకు కోసి వేస్తుండటంతో వైరు బోరు బావిలో పడిపోతోంది. దీంతో బోరు విప్పి బిగించడం వలన అధికంగా ఖర్చు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. వైర్లు చోరీ చేస్తుండటంతో మోటార్లు ఆడక వరి, టమాటా పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొత్త కేబుల్ వైరు మీటరు రూ.150 ఉంది. ఒక్కో రైతుకు దాదాపు 30 నుంచి 40 మీటర్లు వైరు కావలసి వస్తుందని తెలిపారు. 20 రోజుల వ్యవధిలో దాదాపు 70 వ్యవసాయ బోర్ల వద్ద 2 వేల మీటర్ల వైర్లు చోరీ అయినట్లు తెలుస్తోంది. ఎక్కువగా నిమ్మనపల్లి, అగ్రహారం, తవళం, సామకోటవారిపల్లి గ్రామ పంచాయతీల్లోని రైతుల వ్యవసాయ బోర్ల వద్ద వైర్లను దోచుకెళ్లారు. బుధవారం క్రిష్ణయ్య అనే రైతు తన వ్యవసాయ పొలంలో దాదాపు రూ.50 వేల విలువ గల కేబుల్ వైరు దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


వ్యవసాయ బోరు వద్ద కేబుల్ వైరు ఎత్తుకెళ్లిన దొంగలు



నలుగురు అధికారుల ఇంక్రిమెంట్లలో కోత

● రూ.33.50 లక్షలు రికవరీ ● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కలికిరి/కమలాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కమలాపురంలో పనిచేసిన నలుగురు అధికారులపై చర్యలు చేపడుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పదేళ్ల క్రితం అక్కడ ఎంపీడీవోగా పనిచేసిన బి.హరిబాబుకు రెండు ఇంక్రిమెంట్లు, అసిస్టెంట్ ఇంజినీరు ఎస్.సుబ్రమణ్యంకు రెండు ఇంక్రిమెంట్లు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈగా పనిచేసిన కె.విజయకుమార్‌కు ఒక ఇంక్రిమెంటు, కడప పీఐయూ ఏఈఈ కేఎస్ జిలాన్‌కు రెండు ఇంక్రిమెంట్లు ప్రభుత్వం నిలుపుదల చేసింది. అంతేగాకుండా ఈ నలుగురు అధికారుల నుంచి మొత్తం రూ.33,50,180లు వసూలు చేయాలని కూడా ఆదేశించింది. కమలాపురం మండలంలో 2012లో రూ.కోట్ల విలువైన పనులు జరిగాయి. దాదాపు పది రకాల ప్రభుత్వ పథకాల ద్వారా అందిన నిధులతో ఈ పనులు చేపట్టారు. వీటిపై అందిన ఫిర్యాదుల ఆధారంగా 2014లో విజిలెన్స్ అధికారులు క్షుణ్ణంగా దర్యాప్తు చేపట్టి పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. ఈ మేరకు సమగ్ర నివేదికను ప్రభుత్వానికి 2014 అక్టోబరులో సమర్పించారు. దీని ఆధారంగా 8 మంది పైన అభియోగాలు నమోదు చేస్తూ ప్రభుత్వం అధికారులకు సంజాయిషీ నోటీసులు జారీ చేసింది. అధికారుల పంపుకొన్న సంజాయిషీలు సంతృప్తికరంగా లేకపోవడంతో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జె.సత్యనారాయణతో కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్‌ను ఏర్పాటు చేశారు. ఆ తరువాత విచారణకు సుదీర్ఘకాలం పట్టడంతో కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్‌ను కూడా మార్చాల్సి వచ్చింది. ఎంక్వయిరీ కమిషన్ కూడా ఈ నలుగురిపై అభియోగాలను నిర్ధారిస్తూ నివేదిక అందజేసింది. దీంతో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది.

ఉద్యోగం చేస్తున్నారా.. లేదా..

● పనితీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు
● 15 పంచాయతీల్లోని సమస్యలు పరిష్కరించలేదు
● సిబ్బందిపై సబ్ కలెక్టర్ నిధియాదేవి ఆగ్రహం

సుండుపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం చేస్తున్నారా.. లేదా... ఇలాగేనా పనిచేసేది, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను ఎందుకు పరిష్కరించలేదు... 15 గ్రామ పంచాయతీల్లోని సమస్యలు అలాగే ఉన్నాయి.. మీ పనితీరు సరిగ్గా లేదు.. మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది.. సబ్ కలెక్టర్ నిధియాదేవి సుండుపల్లె రెవెన్యూ అధికారులపై శివాలెత్తిపోయారు. మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీలో పైలట్ ప్రాజెక్టుగా జరుగుతున్న రీసర్వేను బుధవారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే పక్కాగా నిర్వహించి ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఎక్కడ కూడా చిన్న భూసమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. ముడుంపాడు రెవెన్యూ గ్రామ పంచాయతీలో 4070 ఎకరాలు రెవెన్యూ భూమి ఉంటే కేవలం ముగ్గురు రైతులు మాత్రమే రీసర్వేలో పాల్గొనడంపై స్థానిక రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన రైతులకు సమస్యలు లేవా రైతులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలపై ఎందుకు దృష్టి సారించడం లేదని, పరిష్కరించకపోవడానికి కారణం ఏమిటని మండిపడ్డారు. అసలు ఉద్యోగం చేస్తున్నారా లేదా మీ పనితీరు సరిగ్గా లేదని, మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. అనంతరం 15 గ్రామ పంచాయతీల్లోని సమస్యలను పరిష్కరించలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో ప్రతి లబ్ధిదారునికి న్యాయం జరిగేలా రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దైవాదీనం, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్‌వో హరీశ్, అన్ని గ్రామ పంచాయతీల సర్వేయర్‌లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సబ్ కలెక్టర్ నిధియాదేవి

ప్రభుత్వ భూములను కాపాడండి

● వివాదాస్పద భూముల్లో జోక్యం చేసుకోవద్దు
● కలెక్టర్ చామకూరి శ్రీధర్


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కురబలకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు, పీజీఆర్‌ఎస్, సీఎంవో పిటీషన్స్‌కు సంబంధించి అర్జీల సమస్యలను పరిష్కరించాలన్నారు. రైతులకు సంబంధించిన సమస్యలను న్యాయమైన పద్ధతిలో పరిష్కరించి న్యాయం చేయాలని ఆదేశించారు. చట్టానికి వ్యతిరేకంగా చేయకూడని పనులను ఎట్టి పరిస్థితులలో చేయరాదని, వివరణాత్మకంగా వారికి తెలియజేయాలన్నారు. అలాగే వివాదాస్పద భూముల్లో అధికారులు జోక్యం చేసుకోవద్దని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే వెంటనే స్వాధీనం చేసుకుని రక్షణ కల్పించాలన్నారు. ప్రభుత్వ టాస్క్‌లను సకాలంలో పూర్తి చేసి జిల్లాను ఆదర్శంగా నిలిపి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రజలు, రైతులకు సంబంధించి 3 రోజుల్లో దారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు ఐవీఆర్‌ఎస్ ద్వారా కాల్స్ వస్తున్నాయని, కావున పనితీరును మెరుగుపరచుకోవాలని లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ తపశ్విని, ఆర్‌ఐ బాలసుబ్రహ్మణ్యం, సర్వేయర్ భువనేశ్వరి, శాంతమ్మ, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడి సస్పెన్షన్

వాల్మీకిపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడు సుదర్శన్ మొదటి, రెండవ డిగ్రీ విద్యార్థినులను అసభ్య పదజాలంతో దూషించిన అధ్యాపకుడిని బుధవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు విలేకరులకు తెలిపారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థినుల పట్ల అధ్యాపకుడి ప్రవర్తన తీరు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పత్రికల్లో కథనాలు రావడంతో ప్రభుత్వం స్పందించి బుధవారం సాయంత్రం కమిషనర్ నారాయణ భరత్ గుప్తా నుంచి అధ్యాపకుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులను అసభ్య పదజాలంతో దూషించి వేధిస్తున్న కామర్స్ అధ్యాపకుడు సుదర్శన్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే క్రిమినల్ నమోదు చేయాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృత్‌తేజ, మాల విద్యార్థి సంఘం రాయలసీమ అధ్యక్షుడు నరేష్‌కుమార్, ఏపీ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఉత్తన్న, జిల్లా అధ్యక్షుడు గంగరాజులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కళాశాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబుతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌరవమైన స్థానంలో ఉన్న అధ్యాపకుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తంచడం బాధాకరమైన విషయమన్నారు.

ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉండాలి

● కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్


పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ ప్రవీణ్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీస్ ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. రాయచోటి పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో కలిసి డీఐజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అర్బన్ పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలించడంతో పాటు నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి చట్ట పరిధిలో బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రతి వారం మహిళా పోలీసులతో కలిసి పాఠశాలల్లో, పబ్లిక్ ప్రదేశాల్లో మాదకద్రవ్యాలు, బాల్యవివాహాలు, మహిళలపై జరిగే నేరాలు, ఆన్‌లైన్, సైబర్ మోసాలు, వైట్‌కాలర్ నేరాలు తదితర విషయాలపై అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా అపార్టుమెంట్‌లు, షాపుల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరించి వాటిని ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసు అధికారులు, మహిళా పోలీసులు బాగా పని చేసి లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కారం అయ్యేవిధంగా చూడాలన్నారు. అంతేగాకుండా ట్రాఫిక్, ఈ-చలానాల పెండింగ్‌లను తగ్గించే విధంగా చూడాలన్నారు.

దేవుడా...
కుటుంబం మొత్తాన్ని తీసుకెళ్లావా...!

● నిన్న భర్త, ఇద్దరు పిల్లలు... నేడు భార్య మృతి
● ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ కన్నుమూత



మృతిచెందిన కవిత, ఇన్‌సెట్‌లో కవిత (ఫైల్)

ములకలచెరువు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): దేవుడా... ఎంత పని చేశావయ్యా... కుటుంబం మొత్తాన్ని తీసుకెళ్లిపోయావా. అభం.. శుభం తెలియని చిన్నారుల సహా పెద్దల వరకు అందరికీ నూరేళ్లు నిండిపోయాయా అంటూ బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. నిరుపేద కుటుంబం మొత్తాన్ని రోడ్డు ప్రమాదం కబలించింది. రోడ్డు ప్రమాదంలో భర్త, ఇద్దరు పిల్లలు మృతి చెందగా... నేడు భార్య కన్ను మూసింది. ములకలచెరువు షాదీమహల్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన సోమశేఖర్, అతని కుమారుడు రెడ్డిశేఖర్, కుమార్తె సిద్దేశ్వరిలు మృతి చెందగా, సోమశేఖర్ భార్య కవిత తీవ్రంగా గాయపడ్డ సంఘటన తెలిసిందే. ఈ క్రమంలో తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కవిత బుధవారం ఉదయం మృతి చెందింది. దీంతో కుటుంబంలో ఒకరు కూడా మిగలకుండా మొత్తం రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లయింది. కవిత మృతదేహానికి తిరుపతి రుయాలోనే పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియల నిమిత్తం బి.కొత్తకోట మండలం బయప్పగారిపల్లె పంచాయతీ కుమ్మరపల్లెకు తరలించారు. రోడ్డు ప్రమాదంలో కుటుంబం మొత్తం మృతి చెందడంతో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా మృతి చెందిన సోమశేఖర్ తండ్రి మద్దిలేటికి ముగ్గురు సంతానం. వీరిలో మొదటి కుమారుడు రాజశేఖర్, రెండవ సంతానం ఉషారాణి కాగా మూడవ సంతానం మృతి చెందిన సోమశేఖర్. నిరుపేద కుటుంబానికి చెందిన సోమశేఖర్ కుటుంబ అంత్యక్రియలు సోదరి ఉషారాణి స్వగ్రామమైన కుమ్మరపల్లెలో నిర్వహించారు.

కుక్కల దాడిలో ఆరు పొట్టేళ్లు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన పొట్టేళ్లు

గాలివీడు, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): కుక్కలు దాడి చేయడంతో ఆరు పొట్టేళ్లు మృతి చెందినట్లు మండలంలోని నూలివీడు పంచాయతీ ఆవులరెడ్డిగారిపల్లెకు చెందిన నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి తన ఇంటికి సమీపంలోని దొడ్డిలో తోలిన పొట్టేళ్లపై కుక్కలు దాడి చేశాయని, బుధవారం ఉదయం తాను వెళ్లి చూసేసరికి ఐదు పొట్టేళ్లు మృతి చెంది కనిపించాయని తెలిపాడు. ఒక్కో పొట్టేలు రూ.15 వేల విలువ చేస్తుందని వివరించారు.





ములకలచెరువులో ఎండీయూ వాహనం వద్ద రేషన్ బియ్యం తీసుకుంటున్న రేషన్‌కార్డుదారులు (ఫైల్)

రేషన్ బియ్యం.. దందా...!

● తంబళ్లపల్లె నుంచి కర్ణాటకకు అక్రమంగా రవాణా
● ప్రతి నెలా లబ్ధిదారులకు 11,500 క్వింటాళ్ల బియ్యం పంపిణీ
● సగానికిపైగా పక్కదారి..?
● ఇక్కడ రూ.15 నుంచి రూ.20కి కొనుగోలు
● కర్ణాటకలో రూ.35 నుంచి రూ.40కి అమ్మకాలు
● గ్రామాల్లోకి వచ్చి ఉచిత బియ్యం కొంటున్న వ్యాపారులు
● చెక్‌పోస్టులు ఎత్తేయడంతో అడ్డూ అదుపు లేకుండా తరలింపు

ములకలచెరువు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి కర్ణాటకకు ప్రభుత్వ చౌకధరల దుకాణ బియ్యం అక్రమంగా రవాణా అవుతోంది. వ్యాపారస్తులు నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి బియ్యం కొనుగోలు చేసి కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల సరిహద్దులోనే కర్ణాటక రాష్ట్రం ఉండడంతో అక్రమ రవాణాకు సులువుగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కర్ణాటక సరిహదుల్లో ఉన్న చెక్‌పోస్టులను ఎత్తేయడంతో బియ్యం అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా సరిహదుల్లో ఉన్న చెక్‌పోస్టులను పునఃప్రారంభించి బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

తంబళ్లపల్లె నియోజవర్గంలోని తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, కురబలకోట, పెద్దమండ్యం మండలాల్లో ప్రభుత్వం ప్రతి నెలా రేషన్‌కార్డుదారులకు ఉచిత బియ్యం అందిస్తోంది. కార్డులో ఎంతమంది ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి ఐదు కేజీల చొప్పున పంపిణీ చేస్తోంది. ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని వ్యాపారస్తులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి నగదు ఆశ చూపడంతో పాటు మభ్యపెట్టి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత లేకనో, తినడానికి ఇబ్బంది ఉందనో పలువురు లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నారు. వ్యాపారస్తులు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి కిలో రూ.15 నుంచి రూ.20కి కొనుగోలు చేస్తున్నారు. ఈ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలించి అక్కడ రూ.35 నుంచి రూ.40 వరకు అమ్ముతున్నారు. రోజువారీ ధరలను బట్టి కర్ణాటకలో రేషన్ బియ్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రతి నెలా సుమారు 11,500 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా రేషన్‌కార్డుదారులకు అందిస్తోంది. ఇందులో సగానికిపైగా వ్యాపారస్తులు కొనుగోలు చేస్తూ కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్నారు.

సన్నబియ్యంగా మార్చి ఇక్కడికే తిరిగి రవాణా...?

ఈ ప్రాంతం నుంచి కర్ణాటకకు అక్రమంగా రవాణా అవుతున్న రేషన్ బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చి ఇక్కడికే తరలించి అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచి వెళ్లిన రేషన్ బియ్యంను మిల్లుల్లో పాలిష్ చేసి సన్న బియ్యంగా మారుస్తున్నారు. సన్నబియ్యంగా మార్చిన రేషన్ బియ్యాన్ని కొత్త రంగురంగుల సంచుల్లో 25 కేజీలు ప్యాకింగ్ చేసి ఈ ప్రాంతంలోని దుకాణాలకు వేసి అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే సన్నబియ్యంగా మార్చిన రేషన్ బియ్యం కర్ణాటకలోని పలు ప్రాంతాలకు అక్కడి వ్యాపారస్తులు తరలించి విక్రయిస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఈ దందా యథేచ్ఛగా సాగింది. ప్రస్తుతం కూడా అలాగే జరుగుతోంది. విచ్చలవిడిగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అడ్డుకట్టవేయాలని పలువురు కోరుతున్నారు.

చెక్‌పోస్టులు మూతపడడంతో సాఫీగా అక్రమ రవాణా

తంబళ్లపపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాలు కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉన్నాయి. దీంతో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అనుకూలంగా మారింది. గతంలో ఆంధ్ర-కర్ణాటక సరిహద్దుల్లో పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అందులో సిబ్బందిని ఉంచి వాహనాల తనిఖీ చేపట్టడంతో కొంతమేరకు అక్రమ రవాణాకు అడ్డుకట్టపడింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ చెక్‌పోస్టులను రెండేళ్ల పాటు ఉంచి తరువాత ఎత్తేసింది. దీంతో రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులు మూతపడ్డాయి. సిబ్బంది కూడా విధుల్లో లేరు. ఈ నేపథ్యంలో తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి అక్రమంగా రవాణా అవుతున్న రేషన్ బియ్యంకు అడ్డులేకుండాపోయింది. బి.కొత్తకోట మండలం తానామరిమిట్ట, బడికాయలపల్లె, పెద్దతిప్పసముద్రం మండలంలోని మారుగానిపల్లె, అంకాలమడుగు, మల్లెల క్రాస్, టి.సదుం వద్ద కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు మూతపడ్డాయి.


పెద్దతిప్పసముద్రం మండలంలోని కర్ణాటక సరిహద్దుల్లో మూతపడ్డ మారుగానిపల్లె, చెంబ్రాయునిపల్లె చెక్‌పోస్టులు

అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

రేషన్ బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయిస్తాం. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచాం. ప్రతిరోజూ సరిహద్దుల్లో వాహనాల తనిఖీ చేపడుతున్నాం. రేషన్ బియ్యం ఎవరైనా అక్రమంగా రవాణా చేస్తే తక్షణం మాకు సమాచారం అందించాలి.

- వెంకటరెడ్డి, సీఎస్ డీటీ, బి.కొత్తకోట

విద్యుత్తులైన్‌పై పడిన ఉడుత

● జంపర్లు కట్.. హైవోల్టేజీ సరఫరా ● సబ్‌కలెక్టరేట్‌లో విద్యుత్తుకు అంతరాయం


తెగిపోయిన విద్యుత్తు జంపర్లు


ప్రమాదానికి కారణమైన ఉడుత

మదనపల్లె, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఇదే కార్యాలయం ఆవరణంలోని సబ్‌స్టేషన్ నుంచి కార్యాలయానికి, బంగ్లాకు విద్యుత్తు సరఫరా అవుతోంది. సబ్‌స్టేషన్‌కు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు సరఫరా అవుతున్న 11 కేవీ వైర్లపై చింతమాను పైనుంచి ఉడుత దూకిందని విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఉడుత విద్యుత్తు షాక్‌తో కాలి కిందపడిపోగా, వైర్ల జంపర్లు తెగిపోవడంతో సరఫరా ఆగిపోయింది. ఈ క్రమంలో భూమికి ఎర్త్ కావడంతో హైవోల్టేజీ సరఫరా అయినట్లు చెబుతున్నారు. ఫలితంగా సబ్‌కలెక్టర్ కార్యాలయంతో పాటు బంగ్లాలోనూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడి, కార్యాలయంలో రెండు కంప్యూటర్లు, ఒక ఏసీ, సెల్‌ఫోన్ చార్జర్ కాలిపోయినట్లు తెలిసింది. దీంతో సబ్‌స్టేషన్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్తు సరఫరా నిలిపేశారు. ఈ మార్గం గుండా కాకుండా ఫోర్‌పోల్స్ విధానంలో డీపీ స్విచ్ ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బంది తలెత్తకుండా విద్యుత్తులైన్‌ను వేరు చేశారు. సోమవారం ఉదయం 7గంటల ప్రాంతంలో జరిగిన ఈ సంఘటన నేపథ్యంలో తాత్కాలిక ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం బుధవారం సాయంత్రం లైన్‌ను ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు. ఇందులో ఈఈ గంగాధర్, ఏడీఈ హరికుమార్, ఏఈలు అక్కడే ఉంటూ పనులు పూర్తి చేశారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి

● జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో మధుసూదనరావు

రాయచోటి కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని డీఆర్‌వో చాంబర్‌లో ఈ నెల 23 నుంచి మార్చి 5 వరకు జరగబోయే వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా దేవదాయశాఖ, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాకు తలమానికమైన భద్రకాళీ సమేత వీర భద్రస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహిం చాలన్నారు. ఈ ఉత్సవాలకు సుమారు రెండు లక్షల మంది భక్తులు రానున్న నేపథ్యంలో ఉచిత దర్శనం, వసతి, భోజనం, తాగునీరు తదితర వసతుల కల్పనపై ఆలయ ఈవో అధికారులతో సమన్వయం చేసుకొని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యుత్‌శాఖ అధికారిని ఆదేశించారు. పోలీసుశాఖ, రోడ్లు భవనాలశాఖ, విద్యుత్ శాఖల సమన్వయంతో రథోత్సవాన్ని నిర్వహించాలన్నారు. హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, వీరభద్రస్వామి ఆలయ ఈవో రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వాసు, రాయచోటి తహసీల్దార్ పుల్లారెడ్డి, విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా శాఖ, రహదారులు, భవనాలశాఖ, ఎక్సైజ్‌శాఖ, విద్యుత్‌శాఖ, అగ్ని మాపక శాఖ, తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా...

● ఏడుగురు పంచాయతీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు


గురుగుపల్లి సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో జవహర్‌బాబు

గాలివీడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విధులకు డుమ్మా కొట్టిన ఏడుగురు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో జవహర్ బాబు తెలిపారు. బుధవారం సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో పలుచోట్ల సచివాలయం సిబ్బంది ముందస్తు అనుమతులు లేకుండా గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో వివిధ సచివాలయాలకు సంబంధించి గైర్హాజరైన వారు రసూల్‌బాషా (పంచాయతీ కార్యదర్శి పూలుకుంట- ఈనెల 3 నుంచి గైర్హాజరు సచివాలయం మూసివేశారు), జె.మదన్‌మోహన్ (పంచాయతీ కార్యదర్శి, గుండ్లచెరువు, డిసెంబరు 28 నుంచి అనుమతి లేకుండా గైర్హాజరు), ఎ.భార్గవి వీఆర్‌వో (పూలుకుంట, అరవీడు- ఈనెల 1 నుంచి అనుమతి లేకుండా గైర్హాజరు, సర్వేల పట్ల నిర్లక్ష్యం), పి.జ్యోతి (జీఎంఎస్‌కే, పూలుకుంట- నవంబరు 30 నుంచి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు), కె.లావణ్య (ఇంజనీరింగ్ అసిస్టెంట్, పూలుకుంట- డిసెంబరు 20 నుంచి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు), కేవీ సుధాకర్ (వీఆర్‌వో, గరుగుపల్లి- సర్వేలకు సహకరించడం లేదు), టీఎస్ యశోదమ్మ (వీఆర్‌వో, గుండ్లచెరువు- సర్వేలకు సహకరించడం లేదు) వీరు ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా సచివాలయాలను వదిలి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గైర్హాజరు కావడంతో రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆయన నోటీసుల్లో పేర్కొన్నారు.

లాభదాయకం.. ఉద్యానం

● ఏపుగా పెరిగిన చీనీ చెట్లు
● ఎకరాకు ఏడాదికి రూ.1.5లక్షల ఆదాయం

చాపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆలోచన మారుతోంది. ప్రతిఏటా వేసే పంటలతో వచ్చే అరకొర ఆదాయంతో విసుగుచెంది రైతులు పంటల మార్పిడికి శ్రీకారం చుడుతున్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటల సాగుతో రైతులు మంచి లాభాలు గడిస్తున్నారు. చాపాడు మండలంలో ప్రతి ఏడాది రైతులు కేసీకెనాల్, చాపాడు చానెల్, వ్యవసాయ ఫిల్టర్ల కింద వరి, పసుపు, నువ్వులు సాగు చేస్తుంటారు. కానీ కష్టానికి తగిన ఆదాయం లభించలేదని రైతులు ఉద్యానవన పంటలపైపు దృష్టి సారించారు. వెదురూరు, రాజుపాళెం, అనంతపురం, నరహరిపురం, నక్కలదిన్నె, రాజువారిపేట, సీతారామపురం, కేతవరం తదితర గ్రామాల రైతులు సుమారు 200 ఎకరాల్లో జామ, చీనీ మొక్కలు నాటారు. ఏడేళ్ల క్రితం నాటిన మొక్కలు ఏపుగా పెరిగి కాయలు కాసి మంచి పంట దిగుబడి ఇస్తున్నాయి. పంట దిగుబడి ఎక్కువగా ఉండడం, రేటు కూడా బాగుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పొలాల్లోనే కొనుగోలు

జామకాయలు, చీనీ పండ్లను తాడిపత్రి, మల్లేల, నంది మండలం ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి నగదు చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. జామ, చీనీ మొక్కలను నాటినా ఏడాది నుంచే కాపుకొస్తున్నాయి. మూడవ ఏడాది నుంచి దిగుబడి ఎక్కువగా ఉంటుందని రైతులు తెలిపారు. ఒక ఎకరాలో చీనీ పండ్లు ఆరు నెలల కాలంలో 42 టన్నుల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఒక టన్ను రూ.40 వేల నుంచి రూ.55 వేల వరకు ధర పలికిందన్నారు. ఒక ఎకరాకు ఖర్చులు పోను రూ.1.50 లక్షలు ఆదాయం మిగిలినట్లు ఓ రైతు తెలిపారు.

90 శాతం సబ్సిడీతో డ్రిప్

డ్రిప్ పద్ధతిలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. వీటికి పది టన్నుల పశువులపేడ, 150 కిలోల సింగిల్ సూపర్, పొటాష్, 15 కిలోల నత్రజని ఉపయోగిస్తున్నారు. అలాగే జీవామృతం నెలకు రెండుసార్లు ఎరువుగా వాడుతున్నారు. తిరుపతిలోని వ్యవసాయ యూనివర్శిటీకి చెందిన శాస్త్రవేత్తలు శ్రీనివాసులరెడ్డి, మహిళా శాస్త్రవేత్త ముకుంద ఈ పంటలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఈ చెట్ల వేర్లకు కుళ్లు తెగుళ్లు రాకుండా ట్రైకోడెర్మా, సూడోమొనాస్ అనే మందులు వాడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో ఇచ్చిన డ్రిప్ పరికరాలు, పైపులతో ప్రతి చెట్టుకు నీటిని అందించేందుకు రైతులకు సులభంగా ఉంది. మొత్తానికి చెట్లు ఏపుగా పెరిగి మంచి దిగుబడి ఇస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ఏపుగా పెరిగిన చెట్లలో కాయలు, పూతను చూపుతున్న రైతు శివారెడ్డి


డ్రమ్ముల్లో ఉన్న జీవామృతం

చీనీ చెట్లతో మంచి ఆదాయం

పది ఎకరాల్లో జంబోరా రకం చీనీ తోట వేశాను. ఏడు సంవత్సరాల క్రితం ఈ మొక్కలు నాటాను. ఇప్పుడు బాగా పెరిగి పంట దిగుబడి వస్తోంది. ఎకరాకు 40 నుంచి 45 టన్నుల చీనీ పండ్లు పండుతున్నాయి. ఏడాదిలో రెండుసార్లు కోతకు వస్తున్నాయి. ఏడాదికి ఎకరాకు రూ.1.50 లక్షల ఆదాయం వస్తోంది. ఇంతకుమునుపు వేరుశనగ, వరి సాగు చేసేవాడిని. ఆ పైర్లు గిట్టుబాటు కాకపోవడంతో చీనీ సాగు చేశాను. చీనీ చెట్లకు జీవామృతం, పశువుల పేడ ఎక్కువగా వాడుతున్నాను. డ్రిప్ పద్ధతిలో నీరందిస్తున్నా. తిరుపతిలోని వ్యవసాయ యూనివర్శిటీ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తున్నా.

- లోమడ శివారెడ్డి, రైతు, వి.రాజుపాళెం గ్రామం

వివాదాస్పదమైన నిర్మాణాల నిలిపివేత

● రెవెన్యూ అధికారుల తీరుపై అనుమానాలు


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న తహసీల్దారు, మండల సర్వేయర్, తదితరులు

పీలేరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం నాగిరెడ్డి కాలనీలో బుధవారం జరిగిన ఓ ఇంటి నిర్మాణ పనుల నిలిపివేత వివాదాస్పదంగా మారింది. నిర్మాణదారుల వద్ద ఉన్న పత్రాలకు, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న వివరాలకు సరిపోవడం లేదని నిర్మాణ పనులను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. అయితే ఈ నెల 2వ తేదీన ఆ పత్రాలు సరైనవేనని రెవెన్యూ అధికారులే ధ్రువీకరించినట్లు తేలడంతో వివాదం ఏర్పడింది. కేవలం పది రోజుల వ్యవధిలో తమ పత్రాలు ఎలా తారుమారు అవుతాయని నిర్మాణదారులు ప్రశ్నిస్తుండడంతో రెవెన్యూ అధికారుల వ్యవహారశైలిపై అనుమానాలకు తెరలేపింది.

పీలేరు పట్టణం కోటపల్లెకు చెందిన ఓ.కళావతమ్మ, సి.గీతలకు నాగిరెడ్డి కాలనీలోని సర్వే నెం.72/2లో అప్పటి రెవెన్యూ అధికారులు 2014లో ఇంటి నివేశన పట్టాలు మంజూరు చేశారు. తమకు కేటాయించిన ఆ స్థలంలో పట్టాదారులు రెండు రోజులుగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ నిర్మాణాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో పీలేరు రెవెన్యూ అధికారులు బుధవారం స్థల పరిశీలన జరిపారు. నిర్మాణదారులు అందజేసిన పట్టాలకు, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న పట్టాలకు సరిపోవడం లేదని తెలియజేస్తూ బుధవారం మధ్యాహ్నం పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు, మండల సర్వేయర్ కిరణ్మయి తమ బృందంతో నిర్మాణ పనులు ఆపివేశారు. ఆ స్థలం ప్రభుత్వానిదని, అందులో ఎటువంటి నిర్మాణాలు చేయకూడదని ఒక హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. అయితే తమకు అక్కడ 2014లో ఇంటి నివేశన పట్టాలు మంజూరు చేశారని, ఆ పట్టాలు సరైనవేనని గతంలో రెవెన్యూ అధికారులు సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన సమాచారం మేరకు లిఖిత పూర్వకంగా తెలియజేశారని పట్టాదారులు తెలిపారు. ఈ నెల 2న కూడా ప్రస్తుత మండల సర్వేయర్ సర్వే చేసి సర్వే నెం.72/2లో ఇంటి పట్టాలు ఉన్నాయంటూ నిర్ధారించారని తెలిపారు. కేవలం 10 రోజుల వ్యవధిలో రికార్డులు ఎలా మారిపోతాయని ఆయన ప్రశ్నించారు. రాజకీయ కారణాలతో రెవెన్యూ అధికారులు తమ నిర్మాణాలను ఆపివేశారని, తాము నిర్మాణాలు ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ సంఘటన బుధవారం పీలేరులో చర్చినీయాంశమైంది. నిర్మాణాలు కొనసాగుతున్న విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గురువారం చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ వివాదం ఏ మలుపు తీసుకుంటుందో వేచి చూడాలి.


హెచ్చరిక బోర్డు తొలగించి పనులు చేసుకుంటున్న నిర్మాణదారులు

సోలార్ వెలుగులు

- జోరుగా సాగుతున్న విద్యుత్తు ప్లాంట్ పనులు
- పనులు పూర్తయితే వెయ్యి మెగా వాట్ల విద్యుత్తు ఉత్పత్తి

మైలవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వద్దిరాల, దొడియం, నక్కవానిపల్లె గ్రామాల కొండ ప్రాంతాల్లో 750 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ పనులు జోరుగా సాగుతున్నాయి.


సోలార్ ప్యానెళ్లను అమర్చుతున్న కూలీలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్తు ప్లాంట్ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఆదానీ సంస్థ 250 మెగావాట్లు, స్వింగ్ కంపెనీ 250 మెగావాట్లు, హయ్యానా సంస్థ 250 మెగావాట్లతో విద్యుత్తు ప్లాంట్ పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు 2,500 కోట్లకుపైగా పెట్టుబడులతో చురుగ్గా ప్యానెల్, కార్నల్ తదితర పనులు సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే మైలవరంలో మొత్తం వెయ్యి మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది.

వైసీపీ హయాంలో నిలిచిన పనులు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సోలార్ పనులు నిలిచిపోయాయి. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ హయాంలో తలమంచిపట్నం, రామచంద్రాయపల్లె, పొన్నంపల్లె గ్రామాల మధ్య కొండ ప్రాంతంలో 250 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ పనులు పూర్తయి విద్యుత్తు ఉత్పత్తి అయ్యేందుకు అప్పటి ప్రభుత్వం కృషి చేస్తే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలిన 750 మెగావాట్ల విద్యుత్తు పనులు చేయడంలో నిర్లక్ష్యం చేశారు. వైసీపీ హయాంలో పనులు నత్తనడకన నడిచాయని స్థానికులు చెబుతారు. 2024లో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో 750 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ పనులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పనులు చకచకా సాగుతున్నాయి. ప్యానల్ పనులు, రోడ్లు,


సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసిన దృశ్యం

విద్యుత్తు, వైరింగ్, తదితర పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆదానీ, స్వింగ్, హయానా 750 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇది కూడా జూన్, జూలై చివరికల్లా సోలార్ విద్యుత్తు ప్లాంట్ పనులు పూర్తయి విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు.

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ ప్రాజెక్టు

మైలవరంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు అవసరమైన నెట్‌వర్క్‌కు బదులు 400 మెగ్గావాట్ల సామర్థ్యంతో బ్యాటరీ, స్టోరేజీ ప్రాజెక్టు ప్రతిపాదించారు. దొడియం గ్రామం వద్ద అతి పెద్ద అల్ట్రా సోలార్ ప్రాజెక్టు నిర్మాణం అవుతోంది. దీంతో మైలవరంలో సోలార్ వెలుగులు వెలుగనున్నాయి.

కనులపండువగా శ్రీవారి బ్రహ్మరథోత్సవం


రథోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో శ్రీవారి బ్రహ్మరథోత్సవం కన్నులపండువగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం 10.30గంటల సమయంలో పద్మావతి సమేత కళ్యాణవేంకటరమణస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రథంపై శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కొలువుదీరారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రథంపై కొలువుదీరిన స్వామివారిని భక్తులు దర్శించుకొని కాయకర్పూరం సమర్పించారు. అనంతరం బ్రహ్మరథాన్ని ముందుకు కదిలించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి రథాన్ని లాగారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శనలు, భజనలు అలరించాయి. శ్రీవారి రథోత్సవం పాతబస్టాండ్ నుంచి పూలంగళ్ల మీదుగా నిర్వహించగా.. అడుగడుగునా భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కుకున్నారు. ఈసందర్భంగా గోవిందన్నామస్మరణలతో పులివెదుల పట్టణం మారుమోగింది. సీఐ నరసింహులు, ఎస్ఐ నారాయణ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

10 మంది జూదరులు అరెస్టు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ జ్యోతినగర్‌లో జూదం ఆడుతున్న 10మంది పేకాటరాయుళ్లను బుధవారం త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.50,520 నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో రమణారెడ్డి, మద్దిలేటిరెడ్డిలతో పాటు మరో 8 మంది వున్నారు. వీరిపై త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

గ్యాస్ లీకేజీతో రూ.2లక్షలు ఆస్తినష్టం


మంటలను ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

బి.కోడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజుపాలెం గ్రామానికి చెందిన బొడుకొండు తిరుపాల్‌రెడ్డి ఇంటిలో గ్యాస్ లీకేజీ కావడంతో మంటలు ఎగిసిపడటంతో ఇంటిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. బుధవారం ఉదయం ఇంటిలో గ్యాస్‌పై వంట చేస్తుండగా సిలిండరు లీకేజీ కావడంతో మంటలు వ్యాపించాయి. ఫైరింజనుకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే ఇంటిలో ఉన్న బీరువా, ఫ్రిజ్, టీవీ తదితర వస్తువులన్నీ కాలిబూడిద య్యాయని వాపోయారు. ఈసంఘనటపై ఎస్ఐ సీపీ రాజు విచారిస్తున్నారు.

కోడిపందెంరాయుళ్లు అరెస్టు

సికెదిన్నె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళంపల్లె సమీపంలో బుధవారం కోడిపందెంరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీకేదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. గ్రామ సమీపంలోని కంపచెట్లలో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి మూడు కోడిపుంజులు, రూ.750 నగదు, 8 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నీళ్లట్యాంకర్ బోల్తా.. యువకుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి

కొండాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాయపల్లె గ్రామానికి చెందిన విశ్వనాథ్(15) అనే యువకుడు బుధవారం నీళ్లట్యాంకర్ బోల్తాపడి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రాగికుంట వద్ద నున్న ఆదానీ కంపెనీకి తిరుమలాయపల్లె నుంచి విశ్వనాథ్ ట్రాక్టర్ నీళ్లట్యాంకర్ తీసుకెళుతుండగా మలుపులో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో విశ్వనాథ్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. మైనర్‌కు ట్రాక్టర్ ఇచ్చినందుకు ట్రాక్టర్ ఓనర్‌పై కూడా కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేరుశనగ పైరుకు నిప్పు

గాలివీడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పైరుకు నిప్పంటించారని మండల పరిధిలోని పూలుకుంట హరిజనవాడకు చెందిన వర్ల నారాయణమ్మ బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 699 బీ2లో రెండు ఎకరాల్లో తాను వేరుశనగ పైరు సాగు చేశానని, ఈ భూమికి వేసిన కంచెకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పైరు కాలిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వైభవం కుంభాభిషేకం

- వేడుకగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుని కల్యాణం
- ముగిసిన బ్రహ్మోత్సవాలు


తాళిబొట్టు చూపెడుతున్న వేద పండితులు

వల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పాపాఘ్ని నదీ తీరాన పైడికాల్వలో కొలువైన రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ బ్రహ్మోత్సవాల్లో కుంభాభిషేకం వైభవంగా సాగింది. బుధవారం ఉదయాన్నే సుప్రభాత సేవ, అనంతరం కలశ ఆవాహన చేసి కలశానికి ఉద్వాసన తెలిపారు. అనంతరం దాదాపు 108 రకాల సుగంధ ద్రవ్యాలతో మహాపూర్ణాహంతి నిర్వహించి యజ్ఞం వేసి ప్రధాన అర్చకులు హరినారాయణశర్మ ఆధ్వర్యంలో పూర్ణాహంతి గావించారు. అనంతరం కుంబాభిషేకం మంగళవాయిద్యాల నడుమ మూల విరాట్టు రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ ఆలయ పరిదేవతలందరికీ కుంభాభి షేకం వేద పండితులు శాస్త్రోక్తంగా చేపట్టారు.

కల్యాణం వైభోగమే

బ్రహ్మోత్సవాల అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ మూలవిరాట్టును సుందరంగా అలంకరించి కోలాటాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. కంకణ ధారణతో కన్యాదానం నిర్వహించారు. తరువాత స్వామివారికి పాద ప్రక్షాళన గావించి జిలకర, బెల్లం ఆ దేవదేవేరుల శిరస్సుపై ఉంచారు. అనంతరం మాంగల్యం తంతునానేనా లోకరక్షణ హేతునా అంటూ శ్రీదేవి భూమి మెడల్లో చెన్నకేశవస్వామి మాంగల్యాన్ని అలంకరించారు. ముత్యాల తలంబ్రాలను శిరస్సుపై పోశారు. ఆలయ ప్రధానార్చకులు హరినారాయణశర్మ ఆధ్వర్యంలో మహామంగళహారతి గావించారు. భక్తులకు తీర్థ, అన్న ప్రసాదాలు అందించారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో వల్లూరు నుంచే కాక కడప, అన్నమయ్య, అనంతపురం తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు పాల్గొని బ్రహ్మోత్సవాలు తిలకించారు.

రుయా నేత్రనిధికి కళ్లు దానం


లీలావతి కళ్లను దానం చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రాన్ని టెక్నీషియన్‌కు అందజేస్తున్న ఆమె కుటుంబసభ్యులు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ మృతిచెందిన లీలావతి(61) కళ్లను ఆమె కుమారుడు సిద్ధారెడ్డి రుయాస్పత్రిలోని నేత్రనిధికి దానం చేశాడు. కడప జిల్లా చియ్యపాడుకు చెందిన లీలావతి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు రుయాస్పత్రికి తీసుకవచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె బుధవారం మృతిచెందారు. దీంతో విషయం తెలుసుకున్న కంటి విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులకు కళ్లు దానం చేయడం వల్ల చూపులేని మరొకరికి కంటి వెలుగు ప్రసాదించే అవకాశం ఉంటుందంటూ అవయవదానంపై అవగాహన కల్పించారు. లీలావతి కుమారుడు సిద్ధారెడ్డి తన తల్లి కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఆయన అనుమతితో నేత్ర విభాగ టెక్నీషియన్ రమేష్ సహకారంతో మృతురాలి కళ్లను సేకరించి రుయాస్పత్రిలోని నేత్రనిధిలో భద్రపరిచారు. తల్లిని కోల్పోయిన దుఃఖంలోనూ ఆమె కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చిన సిద్ధారెడ్డిని వారి కుటుంబ సభ్యులను రుయా అధికారులు అభినందించారు. ఈసందర్భంగా కంటి విభాగాధిపతి చలపతిరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా మృతిచెందితే సకాలంలో వారి కళ్లను దానం చేయడం వలన కంటి చూపులేని మరొకరికి కంటి వెలుగు ప్రసాదించవచ్చన్నారు. కళ్లను దానం చేయాలనుకునే వారు రుయాస్పత్రిలోని నేత్రనిధిని సంప్రదించాలన్నారు.

రిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స


శస్త్ర చికిత్స అనంతరం కణితిని చూపుతున్న వైద్య బృందం

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కడప సర్వజన ఆసుపత్రి రిమ్స్‌లో రాయచోటికి చెందిన వ్యక్తికి అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. రాయచోటికి చెందిన వ్యక్తి కడుపు ఉబ్బరం మరియు కడుపునొప్పితో బాధపడుతూ రిమ్స్‌కు వచ్చారు. సదరు వ్యక్తిని డాక్టర్లు పరీక్షించి కడుపులో పెద్ద కణితి ఉందని నిర్ధారించారు. శస్త్రచికిత్స విభాగాధిపతి డాక్టర్ వాణి ఆధ్వర్యంలో వైద్య బృందం రెండు గంటలపాటు శ్రమించి సుమారు ఆరు కేజీల కణతిని తొలగించినట్లు వైద్య బృందం తెలిపారు. ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్స చేసినందుకు డాక్టర్ వాణి, వైద్య బృందం, మత్తు వైద్య బృందాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ ఈ సందర్భంగా అభినందించారు.

జాతీయస్థాయిలో రిమ్స్ వైద్య విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని హర్షిణిని అభినందిస్తున్న వైద్య బృందం

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గత డిసెంబర్‌లో జాతీయస్థాయిలో ఆగ్రాలో జరిగిన శస్త్రచికిత్స అవగాహన సదస్సులో కడప రిమ్స్ జనరల్ సర్జరీ వైద్య విద్యార్థిని డాక్టర్ యు.హర్షిణి అద్భుత ప్రతిభ కనబరిచారు. జనరల్ సర్జరీ విభాగంలో మూడో సంవత్సరం చదువుతున్న పీజీ విద్యార్థిని మొదటి బహుమతి కైవసం చేసు కున్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని శస్త్రచికిత్స విభాగాధిపతి డాక్టర్ వాణి, ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ అభినందించారు.

ఏఎన్ఎంలకు పదోన్నతులు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఎంపీహెచ్‌డబ్ల్యు (ఎఫ్) పదోన్నతులు కల్పిస్తూ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో ఉమ్మడి జిల్లాల పరిధిలో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న 141 మందికి మెరిట్ ప్రాతిపదికన ఎంపీహెచ్‌డబ్ల్యు(ఎఫ్)లుగా పదోన్నతులు పొందారు. ఈ కమిటీలో జడ్పీసీఈఓ ఓబులమ్మ, మున్సిపల్ కమిషనరు మనోజ్‌రెడ్డి, డీపీఓ, సూపరింటెండెంట్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ



దువ్వూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి రైతు బిడ్డ. ఈ విద్యార్థి చదువులో దిట్ట. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.27 మార్కులు సాధించి తన ప్రతిభను చాటాడు. త్వరలో జరుగబోయే అడ్వాన్స్ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీలో సీటు సాధిస్తారనే విద్యార్థి తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేశారు.

నేత్రపర్వం...శ్రీవారి చక్రస్నానం


వసంతోత్సవంలో స్వామిని ఊరేగిస్తున్న వేదపండితులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన శ్రీవారి చక్రస్నానం బుధవారం భక్తుల కోలాహలం మధ్య వైభవంగా జరిగింది. టీటీడీ వేదపండితులు వేకువజామునే శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించి నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా వసంతోత్సవం నిర్వహించి, స్వామి వారిని ఆలయ మాడ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. భక్తు లు అడుగడుగునా స్వామి వారికి కర్పూర హారతులు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తదనంతరం ఆలయ వాహన మండపంలో వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవీ, భూదేవి సమేత ఉత్సవమూర్తులకు, శ్రీవారి సుదర్శన చక్రతాళ్వార్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గంగాళంలోని జలంలో ముంచి చక్రస్నానం నిర్వహించారు. సాయం త్రం ఆలయ ధ్వజస్తంభం పైకి సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ఆరంభంలో ఎగురేసిన గరుడ ధ్వజపటాన్ని అవరోహణం గావించా రు. గురువారం ఉదయం శ్రీవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం పుష్పయాగంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఉపప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టర్, అర్చకులు రమేష్ స్వామి టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలుజాతి ఆవుకు కవల దూడలు



సికెదిన్నె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలుజాతి ఆవుకు ఒకేసారి రెండుదూడలు జన్మించినట్లు వేపమాను సత్రం గ్రామానికి చెందిన రైతు క్రిష్ణానాయక్ తెలిపారు. ఈ ఆవు 15 ఈతలు ఈనిందని, గతంలోనూ ఈ ఆవుకు కవల దూడలు జన్మించాయన్నారు. పశువైద్యులు నాగరాజు, సహాయకులు కిశోర్ ఆధ్వర్యంలో ఈ ఆవుకు గర్భధారణ చేశారు. బుధవారం ఆవుకు రెండు లేగదూడలు పూర్తి ఆరోగ్యంగా జన్మించడంతో హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యతే ప్రామాణికంగా దరఖాస్తులను పరిష్కరించండి

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాణ్యతే ప్రామాణికంగా పీజీఆర్ఎస్ దరఖాస్తు లను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మదనపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు 6 నుంచి జనవరి 8 వరకు మండలం లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భాగంగా భూసమస్యలపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారం ప్రగతిపై తహసీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో వచ్చిన సమస్యలు ఏన్ని పరిష్కారం జరిగాయి.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.. ఎందుకు పరిష్కారం అందించలేకపోయారో తహసీల్దార్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పీజీఆర్ఎస్‌లో 11వేల దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ఇప్పటికి ఐదు వేలు దరఖాస్తులకు పరిష్కారం అందించారని తెలిపారు. మిగిలిన దరఖాస్తులు అత్యంత నాణ్యతతో వేగంగా కచ్చితత్వంతో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఐవీఆర్ఎస్ ద్వారా నేరుగా దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది మీ దగ్గరకు వచ్చారా, మీ సమస్య పరిష్కారం అయిందా, క్షేత్ర స్థాయిలో విచారణ చేస్తున్నారా అని ప్రశ్నలు వేస్తున్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జిల్లాలో భాగా వెనకబడిన మండలాల్లో మదనపల్లె కూడా ఒక్కటన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో వెనకబడి ఉన్న వీఆ ర్వోలను వెంటనే మండలంలోని వివిధ ప్రాంతాలకు పంపాలని తహసీల్దార్‌కు సూచించారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేసి నాణ్యతతో పరిష్కారం చేయడమే ధ్యేయం కావాలన్నారు. ఇంకను పెండింగ్‌లో ఉన్న వాటిని ఎస్ఎల్ఏ పరిధిలోగా పరిష్కరించాలన్నారు. వచ్చిన అర్జీల్లో మ్యూటేషన్, అసైన్మెంట్, ఆర్ఓఆర్, భూ సేకరణ, దారిసమస్యలు, అన్నదమ్ముల భాగపరిష్కారాలు, సివిల్ కేసులు తదితరాలపై సమీక్షించి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో ప్రభుత్వ భూములు ఎక్కడైనా ఆక్రమణ జరిగినట్లు గుర్తిస్తే వెంటనే తొలగించి స్వాధీనం చేసుకోవాలన్నారు. సమావేశంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ ధనంజయులు, ఆర్ఐ శేషాద్రిరావు, మండల సర్వేయర్ రెడ్డి శేఖర్, వీఆర్వోలు, విఆర్ఏలు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం



నందలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం నాగిరెడ్డిపల్లెలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామివ్రతం నిర్వహించారు. అనంతరం గెలివి మల్లికార్జునరెడ్డి, నిర్మల దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, సెక్రటరి గెలివి కుమార్, ఆర్యవైశ్య సంఘం మాజీ సెక్రటరీ మేడా వెంకటకుమార్, గెలివి శివశంకర్ పాల్గొన్నారు.

అధికారులు ఎప్పుడొస్తారో?

- అధికారులు లేక తెరుచుకోని కార్యాలయం...
- ఇదీ నియోజకవర్గంలోని ఇరిగేషన్ కార్యాలయం దుస్థితి...



తెరుచుకోని ఇరిగేషన్ కార్యాలయం

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆ కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో కార్యాలయం గేట్లు కూడా తెరుచుకోని పరిస్థితి. నియోజకవర్గంలోని ప్రధాన మండలంలోని ఇరిగేషన్ కార్యాలయంలో కేవలం డీఈ వినోద్‌కుమార్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు ఒక ఏఈ కూడా లేకపోవడం ఏంటని పలువురు చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వం ఇద్దరు ఏఈలు, డీఈ అందుబాటులో ఉండేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజంపేట, నందలూరులో విధులు నిర్వహిస్తున్న ఏఈలకు కోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలి మండలాలకు అదనపు బాధ్యతలను జిల్లా అధికారులు కల్పించారు. పనిభారం ఎక్కువ ఉండడంతో తాము అదనపు బాధ్యతలు చేయలేమని ఏఈలు జిల్లా అధికారులకు తెలియజేసినట్లు సమాచారం. అధికారులు లేకపోవడంతో నియోజకవర్గంలో ఇరిగేషన్ పనులు నత్తనడకగా సాగుతున్నాయి. ఇరిగేషన్ పరిధిలో ఉన్న వేలాది ఎకరాల భూములు కబ్జాకు గురవుతున్నాయి. కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయాలంటే అధికారులు అందుబాటులో ఉండరు. డీఈకి ఎన్నిసార్లు చెప్పినా అధికారులు లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఇరిగేషన్ పనులు జరగకపోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి. ఈ విషయమై స్థానిక డీఈని వివరణ కోరగా అధికారులు లేకపోవడంతో పనులు చేయలేకపోతున్నాము అని పేర్కొన్నారు. ఆ కార్యాలయానికి అధికారులు ఎప్పుడొస్తారో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు స్పందించని పక్షంలో ఇరిగేషన్ పనులు మరుగున పడటం ఖాయం.

నీళ్ల ట్యాంకు శుభ్రం చేశారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సిద్దవటం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 'పేరుకుపోయిన నిర్లక్ష్యం' శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించారు. మండలంలోని జంగాలపల్లె ఎస్సీ కాలనీలోని తాగునీటి ట్యాంకును గ్రామ సర్పంచ్ వెంకటమ్మ ఆధ్వర్యంలో హరిత రాయబారులు శుభ్రం చేశారు. ట్యాంకు లీకేజీని అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ట్యాంకు చుట్టూ బ్లీచింగ్ చల్లారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ జానకి పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన



తాగునీటి సమస్య పరిష్కరించాలని సిద్దవటం మండలంలోని వెలుగుపల్లె ఎస్సీ కాలనీ మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ 15 రోజులుగా కొళాయిలకు నీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ సెక్రటరీ జానకి మాట్లాడుతూ పెన్నానదిలో తాగునీటి పైపు దెబ్బతినడంతో నీటి కొరత ఏర్పడిందని, రెండు రోజుల్లో పరిష్కరిస్తామని అన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి

ఎన్‌హెచ్‌ఏఐ ఆర్వోకు ఎమ్మెల్యే వినతి



రైల్వేకోడూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కడప-రేణిగుంట ప్రధానదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కోరారు. ఈ మేరకు బుధవారం నేషనల్ హైవే అథారిటీ ఆర్వో ఆర్‌కే సింగ్‌ను విజయవాడలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప-రేణిగుంట మార్గంలో గుంతలు పూడ్చే పనులు త్వరగా పూర్తి చేయడంతో పాటు, మరో లేయర్ బీటీ వేయాలని కోరామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నలుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు ఉన్నా.. 2022లో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు టెండరు ప్రక్రియ పూర్తి చేసినా రోడ్లను బాగు చేయలేదన్నారు. కడప-రేణిగుంట రోడ్డులో వాహనాల సంఖ్య అధికంగా ఉందని, మూడు జిల్లాల పరిధిలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించరాదు: ఎస్ఐ

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించరాదని రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్‌బాబు తెలిపారు. బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య తొలగేందుకు ప్రజలు కూడా సహకారం అందించాలని తెలిపారు. ట్రాఫిక్ చట్టాలను ఎవరైనా అతిక్రమించినా, హెల్మెట్ పెట్టుకోకపోయినా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పేదలకు వరం సీఎం సహాయ నిధి



సీఎం సహాయనిధి పొందిన వారితో బాలసుబ్రమణ్యం

రాజంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పేదలు అనారోగ్యానికి గురైతే బాగు చేసుకోవడానికి సీఎం సహాయనిధి ఓ వరంలాంటిదని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. బుధవారం రాజంపేట నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆయన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. పసుపులేటి దుర్గయ్యకు రూ.1.88 లక్షలు, మాడవూరి శ్రీనివాసులు రూ.1.35 లక్షలు, బత్తల శివప్రసాద్‌కు రూ.1.54 లక్షలు, పి.సుభాషిణికి రూ.37 వేలు, జయరామిరెడ్డికి రూ.5 వేలు, కృష్ణయ్యకు రూ.25 వేలు, గునిపూటి స్వప్నకు రూ.56 వేల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు పొందూరు కొండయ్యనాయుడు, జిల్లా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత రమణ, ఊటుకూరు టీడీపీ నాయకులు చెంగల్‌రాయులు, హరి ట్రేడర్స్ అధినేత గుగ్గిళ్ల హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోండి

వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్

సంబేపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధునీకరణ పద్ధతిలో రైతులకు 14 అంకెల ప్రభుత్వ విశిష్ట గుర్తింపు యూనిక్ ఐడీ కార్డు అందిస్తున్నట్లు వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్ తెలిపారు. బుధవారం దేవపట్ల గ్రామం కట్టుగుత్తపల్లెలో ఫార్మసీ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీ పథకాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయితీ పెట్టుబడులు, వివిధ రకాల వ్యవసాయ సాయం పొందేందుకు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. సొంత భూమి ఉన్న రైతులు మాత్రమే నమోదు చేసుకోవాలన్నారు. రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ, ఆధార్‌జిరాక్స్, ఆధార్ నెంబర్‌కు లింకు అయిన ఫోన్ నెంబరు తీసుకెళ్లి భూఆధార్ ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఫిబ్రవరి 25వ తేదీవరకు నమోదు చేస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారులు కిశోర్‌నాయక్, వెంకటమోహన్, గ్రామ వ్యవసాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల దీక్ష భగ్నం చేయడం అన్యాయం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : తమను విధుల్లోకి తీసుకోవాలంటూ దీక్షలు చేస్తున్న ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండానే దీక్షా శిబిరాన్ని దౌర్జన్యంగా తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్లో సబ్ స్టాఫ్, హౌస్‌కీపింగ్, స్కావెంజర్స్‌గా పనిచేస్తున్న 10 మందిని విధుల్లోకి తీసుకోవాలంటూ 17 రోజులుగా పాఠశాల గేటు బయట నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని తొలగించి కార్మికులను తీసుకెళ్లడం రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లుకు తగదన్నారు. వారికి న్యాయం చేయాలని ఏపీఎండీసీ అధికారులు, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్ చెప్పినా కాంట్రాక్టర్ పట్టించుకోలేదన్నారు. గతంలో కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ మొత్తం స్వాహా చేసిన కాంట్రాక్టర్‌పైన కేసు పెట్టకపోగా, శాంతియుతంగా దీక్షలు చేస్తున్నవారిని అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు సోమవారం కాంట్రాక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని కార్మికులకు, నాయకులకు సీఐ మాట ఇచ్చారని, న్యాయం జరగకుంటే సోమవారం తరువాత ఆమరణ దీక్షలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.జాన్‌ప్రసాద్, బాధితులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏపీఎండీసీ స్కూల్స్ కార్మికులను ఉద్యోగాల్లో నుంచి తొలగించి వారి కడుపు కొడుతున్న ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెబుతామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు అన్నారు. బుధవారం పాత రాయచోటిలోని సచివాలయం ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు చీపుర్లు, గంపలు చేత బట్టి నిరసన తెలిపారు ప్రభుత్వం అకారణంగా తొలగించిన స్వీపర్లకు అండగా సీఐటీయూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని ఆయన హెచ్చరించారు.

గోవిందంపల్లెలో ఏపీడీ విచారణ

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోవిందంపల్లె గ్రామ పంచాయతి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామ సచివాలయంలో ఏపీడీ ప్రతాప్ బుధవారం విచారణ చేపట్టారు. గోవిందపల్లె ఉపాధి హామీ ఉద్యోగి పెంచలయ్యపై కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేయడంతో ఏటీఎం ధనుంజయ్య, సిబ్బందితో కలిసి గ్రామ సచివాలయంలో గ్రామస్థుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఎంక్వైరి అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా మాఘపౌర్ణమి పూజలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల శివనంది చెక్‌పోస్టు సర్కిల్‌లో వెలిసిన శ్రీఉమామహేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు నటరాజస్వామి ఆధ్వర్యంలో మాఘపౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాఘపౌర్ణమిని పురస్కరించుకొని ఆలయంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వ్రతం కార్యక్రమానికి పట్టణంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వ్రతం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మాఘపౌర్ణమి రోజున సత్యనారాయణ వ్రతం ఆచరించినా, వ్రతం కార్యక్రమంలో పాల్గొన్న వారికి సకల శుభాలు జరుగుతాయన్నారు.

16న బీసీ సంక్షేమ సంఘం మహాసభలు

రామాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బీసీలకు అన్ని విధాలా న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా బీసీ సంఘం అధ్యక్షురాలు పద్మాయాదవ్ డిమాండ్ చేశారు. ఈ నెల 16న అజయ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభకు బీసీ సంఘ సభ్యులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని నీలకంఠ్రావు పేటలో బుధవారం బీసీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్‌యాదవ్, రమేశ్, కొండయ్య, ఆవుల రమణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో విద్యార్థిని ప్రతిభ



సుగుణకు ప్రశంసాపత్రం అందజేస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్టూడెంట్ మీట్‌లో రాజంపేట అన్నమాచార్య ఫార్మసీ కళాశాల విద్యార్థిని సుగుణ మొదటి బహుమతి సాధించారు. బీఫార్మసీ 4వ సంవత్సరం చదువుతున్న సుగుణ ఇటీవల ఒంగోలులోని క్విస్ విద్యాసంస్థల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో లాంగ్‌జంప్‌లో మొదటి స్థానం సాధించారు. అన్నమాచార్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత జ్ఞాపిక అందజేసి అభినందించారు.

పీహెచ్‌సీలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్



చిన్నమండెం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని డాక్టర్ సునీత తెలిపారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో మోడల్ మండల్ టీం లీడ్ చందురెడ్డి, మండల ఇన్‌చార్జి శ్రీనివాసులు, ఎంటీ పద్మావతి ఆధ్వర్యంలో చిన్నమండెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ తాజా కూరగాయలు, ఆకుకూరలు, నాణ్యత కలిగిన పసుపు, కొర్రలు, మిర్చిపొడి ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారని తెలిపారు.

జాతర విజయవంతానికి సహకరించండి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురం గంగమ్మ జాతర ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం గంగమ్మ దేవాలయంలో గ్రామపెద్దలు, టీడీపీ మండల ఇన్‌చార్జ్ యనమల మదన్‌మోహన్ ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జాతర ఏర్పాట్లు ముమ్మరంగా చేపడుతున్నామని, ఇప్పటికే అమ్మవారి రాజగోపురాలు, ప్రహరీ, ఆలయ ప్రాంగణంలో పెయింటింగ్ పనులు పూర్తయ్యాయని, జాతర ప్రాంగణంలో కంపచెట్లు, మరుగుగొడ్లు, మహిళలకు ప్రత్యేక స్నానవాటికలు, తాగునీరు, విద్యుత్ , ఆరోగ్యకేంద్రాలు తదితర విషయాలపై ఆరా తీశారు. రెండు రోజులు దాదాపు 2 నుంచి 3 లక్షల మంది భక్తులు జాతరకు వస్తారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కమిటీ సభ్యులకు తెలిపారు. చిట్లూరు క్రాస్ నుంచి వచ్చే బస్సులకు యనమలవాండ్లపల్లె వద్ద అలాగే మర్రిచెట్టు రవీంద్రనగర్ నుంచి వచ్చే బస్సులకు చౌటపల్లె సమీపంలో బస్టాపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. జాతరలో లోపలికి ప్రైవేటు వాహనాలకు ఒక స్టాండ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జాతరలోని మంచినీటి పథకం బోర్లను మరమ్మతులు చేయించడం, దాతలు ఉచితంగా ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా నీరు అందించేవారు ముందుగానే ఆలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

ఆటోలకు పీసీ నెంబర్లు ఏర్పాటు



ఆటోలకు నెంబర్లు అందజేస్తున్న పోలీసులు

రామాపురం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): రామాపురం పోలీస్‌స్టేషన్‌లో మండలానికి చెందిన ఆటోలకు పీసీ నెంబర్లు కేటాయించినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీ నెంబర్లతో ఆటోలను గుర్తించడం సులభంగా వీలవుతుందన్నారు. ఏదైనా నేరం జరిగినప్పుడు తొందరగా ఇన్ఫర్మేషన్ కనుక్కోవడంతోపాటు, ఆటోల్లో ప్రయాణికులు మర్చిపోయిన వస్తువులను సదరు నెంబర్ల ఆధారంగా గుర్తించవచ్చన్నారు.

చంద్రబాబుతోనే ముస్లింల సంక్షేమం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముస్లింల సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఇమామ్‌లు, మౌజన్‌లకు మార్చి నుంచి జీతాలు ఇవ్వడమే కాకుండా నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అవసరమైన చోట ఈద్గాలకు భూములు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారన్నారు. రంజాన్ తోఫా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడమే కాకుండా అన్ని విభాగాల్లో పనిచేస్తే ముస్లిం మైనార్టీ ఉద్యోగులకు రంజాన్ ప్రార్థనల కోసం ఒక గంట ముందుగానే వెళ్లే విధంగా ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు, మైనార్టీశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలకు రాయచోటి నియోజకవర్గ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హబీబ్, రహంతుల్లా, షరీఫ్, హైదర్, రౌఫా, ఎస్‌యండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

'జనసేన ఉండగా వైసీపీ అధికారంలోకి రాదు'

చిట్వేలి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో జనసేన ఉన్నంతకాలం వైసీపీ అధికారంలోకి రాదని మండల జనసేన నాయకులు మాదాసు నరసింహ అన్నారు. బుధవారం స్థానిక జనసేనపార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజారాజ్యం రూపాంతరం చెంది జనసేన అయ్యిందంటూ మెగాస్టార్ చేసిన వ్యాఖ్యాలపై వ్యంగ్యంగా మాట్లాడిన వైసీపీ నేత అంబటి రాంబాబును విమర్శించారు. జనసేనపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రామాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. శ్రీనివాసులు, జహీరున్ బుధవారం స్కూటర్‌పై పొలానికి వెళుతుండగా వెనుకనుంచి ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు కాలు విరగగా, జహీరున్‌కు రక్త గాయాలయ్యాయి.

కంచెకు నిప్పు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కంచెకు నిప్పంటుకోవడంతో యనమలవాండ్లపల్లెకు చెందిన యనమల విశ్వనాథకు చెందిన తోటలోని మామిడి, కొబ్బరి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయని రైతులు తెలిపారు. బుధవారం ఉదయాన్నే గుర్తు తెలియని వ్యక్తులు ముళ్ల పొదలకు నిప్పు పెట్టడంతో ఆ మంటలు వ్యాపించి కంచె దగ్ధమైనట్లు రైతులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం రాయచోటి నుంచి రాజంపేటలోని కొత్తబస్టాండుకు వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఈడిగపాలెం మలుపు సమీపంలో రోడ్డు దాటుతున్న సాదక్‌వలిని ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

దేవుడా... కుటుంబం మొత్తాన్ని తీసుకెళ్లావా...!

- నిన్న భర్త, ఇద్దరు పిల్లలు... నేడు భార్య మృతి
- ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ కన్నుమూత



మృతిచెందిన కవిత, ఇన్‌సెట్‌లో కవిత (ఫైల్)


ములకలచెరువు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): దేవుడా... ఎంత పని చేశావయ్యా... కుటుంబం మొత్తాన్ని తీసుకెళ్లిపోయావా. అభం.. శుభం తెలియని చిన్నారుల సహా పెద్దల వరకు అందరికీ నూరేళ్లు నిండిపోయాయా అంటూ బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. నిరుపేద కుటుంబం మొత్తాన్ని రోడ్డు ప్రమాదం కబలించింది. రోడ్డు ప్రమాదంలో భర్త, ఇద్దరు పిల్లలు మృతి చెందగా... నేడు భార్య కన్ను మూసింది. ములకలచెరువు షాదీమహల్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన సోమశేఖర్, అతని కుమారుడు రెడ్డిశేఖర్, కుమార్తె సిద్దేశ్వరిలు మృతి చెందగా, సోమశేఖర్ భార్య కవిత తీవ్రంగా గాయపడ్డ సంఘటన తెలిసిందే. ఈ క్రమంలో తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కవిత బుధవారం ఉదయం మృతి చెందింది. దీంతో కుటుంబంలో ఒకరు కూడా మిగలకుండా మొత్తం రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లయింది. కవిత మృతదేహానికి తిరుపతి రుయాలోనే పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియల నిమిత్తం బి.కొత్తకోట మండలం బయప్పగారిపల్లె పంచాయతీ కుమ్మరపల్లెకు తరలించారు. రోడ్డు ప్రమాదంలో కుటుంబం మొత్తం మృతి చెందడంతో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా మృతి చెందిన సోమశేఖర్ తండ్రి మద్దిలేటికి ముగ్గురు సంతానం. వీరిలో మొదటి కుమారుడు రాజశేఖర్, రెండవ సంతానం ఉషారాణి కాగా మూడవ సంతానం మృతి చెందిన సోమశేఖర్. నిరుపేద కుటుంబానికి చెందిన సోమశేఖర్ కుటుంబ అంత్యక్రియలు సోదరి ఉషారాణి స్వగ్రామమైన కుమ్మరపల్లెలో నిర్వహించారు.

కుక్కల దాడిలో ఆరు పొట్టేళ్లు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన పొట్టేళ్లు

గాలివీడు, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): కుక్కలు దాడి చేయడంతో ఆరు పొట్టేళ్లు మృతి చెందినట్లు మండలంలోని నూలివీడు పంచాయతీ ఆవులరెడ్డిగారిపల్లెకు చెందిన నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి తన ఇంటికి సమీపంలోని దొడ్డిలో తోలిన పొట్టేళ్లపై కుక్కలు దాడి చేశాయని, బుధవారం ఉదయం తాను వెళ్లి చూసేసరికి ఐదు పొట్టేళ్లు మృతి చెంది కనిపించాయని తెలిపాడు. ఒక్కో పొట్టేలు రూ.15 వేల విలువ చేస్తుందని వివరించారు.

రేషన్ బియ్యం.. దందా...!


ములకలచెరువులో ఎండీయూ వాహనం వద్ద రేషన్ బియ్యం తీసుకుంటున్న రేషన్‌కార్డుదారులు (ఫైల్)

- తంబళ్లపల్లె నుంచి కర్ణాటకకు అక్రమంగా రవాణా
- ప్రతి నెలా లబ్ధిదారులకు 11,500 క్వింటాళ్ల బియ్యం పంపిణీ
- సగానికిపైగా పక్కదారి..?
- ఇక్కడ రూ.15 నుంచి రూ.20కి కొనుగోలు
- కర్ణాటకలో రూ.35 నుంచి రూ.40కి అమ్మకాలు
- గ్రామాల్లోకి వచ్చి ఉచిత బియ్యం కొంటున్న వ్యాపారులు
- చెక్‌పోస్టులు ఎత్తేయడంతో అడ్డూ అదుపు లేకుండా తరలింపు

ములకలచెరువు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి కర్ణాటకకు ప్రభుత్వ చౌకధరల దుకాణ బియ్యం అక్రమంగా రవాణా అవుతోంది. వ్యాపారస్తులు నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి బియ్యం కొనుగోలు చేసి కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల సరిహద్దులోనే కర్ణాటక రాష్ట్రం ఉండడంతో అక్రమ రవాణాకు సులువుగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కర్ణాటక సరిహదుల్లో ఉన్న చెక్‌పోస్టులను ఎత్తేయడంతో బియ్యం అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా సరిహదుల్లో ఉన్న చెక్‌పోస్టులను పునఃప్రారంభించి బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

తంబళ్లపల్లె నియోజవర్గంలోని తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, కురబలకోట, పెద్దమండ్యం మండలాల్లో ప్రభుత్వం ప్రతి నెలా రేషన్‌కార్డుదారులకు ఉచిత బియ్యం అందిస్తోంది. కార్డులో ఎంతమంది ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి ఐదు కేజీల చొప్పున పంపిణీ చేస్తోంది. ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని వ్యాపారస్తులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి నగదు ఆశ చూపడంతో పాటు మభ్యపెట్టి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత లేకనో, తినడానికి ఇబ్బంది ఉందనో పలువురు లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నారు. వ్యాపారస్తులు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి కిలో రూ.15 నుంచి రూ.20కి కొనుగోలు చేస్తున్నారు. ఈ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలించి అక్కడ రూ.35 నుంచి రూ.40 వరకు అమ్ముతున్నారు. రోజువారీ ధరలను బట్టి కర్ణాటకలో రేషన్ బియ్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రతి నెలా సుమారు 11,500 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా రేషన్‌కార్డుదారులకు అందిస్తోంది. ఇందులో సగానికిపైగా వ్యాపారస్తులు కొనుగోలు చేస్తూ కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్నారు.

చెక్‌పోస్టులు మూతపడడంతో సాఫీగా అక్రమ రవాణా


పెద్దతిప్పసముద్రం మండలంలోని కర్ణాటక సరిహద్దుల్లో మూతపడ్డ మారుగానిపల్లె, చెంద్రాయునిపల్లె చెక్‌పోస్టులు

తంబళ్లపపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాలు కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉన్నాయి. దీంతో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అనుకూలంగా మారింది. గతంలో ఆంధ్ర-కర్ణాటక సరిహద్దుల్లో పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అందులో సిబ్బందిని ఉంచి వాహనాల తనిఖీ చేపట్టడంతో కొంతమేరకు అక్రమ రవాణాకు అడ్డుకట్టపడింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ చెక్‌పోస్టులను రెండేళ్ల పాటు ఉంచి తరువాత ఎత్తేసింది. దీంతో రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులు మూతపడ్డాయి. సిబ్బంది కూడా విధుల్లో లేరు. ఈ నేపథ్యంలో తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి అక్రమంగా రవాణా అవుతున్న రేషన్ బియ్యంకు అడ్డులేకుండాపోయింది. బి.కొత్తకోట మండలం తానామరిమిట్ట, బడికాయలపల్లె, పెద్దతిప్పసముద్రం మండలంలోని మారుగానిపల్లె, అంకాలమడుగు, మల్లెల క్రాస్, టి.సదుం వద్ద కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు మూతపడ్డాయి.

అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

రేషన్ బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయిస్తాం. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచాం. ప్రతిరోజూ సరిహద్దుల్లో వాహనాల తనిఖీ చేపడుతున్నాం. రేషన్ బియ్యం ఎవరైనా అక్రమంగా రవాణా చేస్తే తక్షణం మాకు సమాచారం అందించాలి.

- వెంకటరెడ్డి, సీఎస్ డీటీ, బి.కొత్తకోట

సన్నబియ్యంగా మార్చి ఇక్కడికే తిరిగి రవాణా...?

ఈ ప్రాంతం నుంచి కర్ణాటకకు అక్రమంగా రవాణా అవుతున్న రేషన్ బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చి ఇక్కడికే తరలించి అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచి వెళ్లిన రేషన్ బియ్యంను మిల్లుల్లో పాలిష్ చేసి సన్న బియ్యంగా మారుస్తున్నారు. సన్నబియ్యంగా మార్చిన రేషన్ బియ్యాన్ని కొత్త రంగురంగుల సంచుల్లో 25 కేజీలు ప్యాకింగ్ చేసి ఈ ప్రాంతంలోని దుకాణాలకు వేసి అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే సన్నబియ్యంగా మార్చిన రేషన్ బియ్యం కర్ణాటకలోని పలు ప్రాంతాలకు అక్కడి వ్యాపారస్తులు తరలించి విక్రయిస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఈ దందా యథేచ్ఛగా సాగింది. ప్రస్తుతం కూడా అలాగే జరుగుతోంది. విచ్చలవిడిగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అడ్డుకట్టవేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్తులైన్‌పై పడిన ఉడుత

- జంపర్లు కట్.. హైవోల్టేజీ సరఫరా
- సబ్‌కలెక్టరేట్‌లో విద్యుత్తుకు అంతరాయం


తెగిపోయిన విద్యుత్తు జంపర్లు


ప్రమాదానికి కారణమైన ఉడుత

మదనపల్లె, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఇదే కార్యాలయం ఆవరణలోని సబ్‌స్టేషన్ నుంచి కార్యాలయానికి, బంగ్లాకు విద్యుత్తు సరఫరా అవుతోంది. సబ్‌స్టేషన్‌కు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు సరఫరా అవుతున్న 11 కేవీ వైర్లపై చింతమాను పైనుంచి ఉడుత దూకిందని విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఉడుత విద్యుత్తు షాక్‌తో కాలి కిందపడిపోగా, వైర్ల జంపర్లు తెగిపోవడంతో సరఫరా ఆగిపోయింది. ఈ క్రమంలో భూమికి ఎర్త్ కావడంతో హైవోల్టేజీ సరఫరా అయినట్లు చెబుతున్నారు. ఫలితంగా సబ్‌కలెక్టర్ కార్యాలయంతో పాటు బంగ్లాలోనూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడి, కార్యాలయంలో రెండు కంప్యూటర్లు, ఒక ఏసీ, సెల్‌ఫోన్ చార్జర్ కాలిపోయినట్లు తెలిసింది. దీంతో సబ్‌స్టేషన్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్తు సరఫరా నిలిపేశారు. ఈ మార్గం గుండా కాకుండా ఫోర్‌పోల్స్ విధానంలో డీపీ స్విచ్ ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బంది తలెత్తకుండా విద్యుత్తులైన్‌ను వేరు చేశారు. సోమవారం ఉదయం 7గంటల ప్రాంతంలో జరిగిన ఈ సంఘటన నేపథ్యంలో తాత్కాలిక ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం బుధవారం సాయంత్రం లైన్‌ను ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు. ఇందులో ఈఈ గంగాధర్, ఏడీఈ హరికుమార్, ఏఈలు అక్కడే ఉంటూ పనులు పూర్తి చేశారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి

- జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో మధుసూదనరావు

రాయచోటి కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని డీఆర్‌వో చాంబర్‌లో ఈ నెల 23 నుంచి మార్చి 5 వరకు జరగబోయే వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా దేవదాయశాఖ, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాకు తలమానికమైన భద్రకాళీ సమేత వీర భద్రస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహిం చాలన్నారు. ఈ ఉత్సవాలకు సుమారు రెండు లక్షల మంది భక్తులు రానున్న నేపథ్యంలో ఉచిత దర్శనం, వసతి, భోజనం, తాగునీరు తదితర వసతుల కల్పనపై ఆలయ ఈవో అధికారులతో సమన్వయం చేసుకొని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యుత్‌శాఖ అధికారిని ఆదేశించారు. పోలీసుశాఖ, రోడ్లు భవనాలశాఖ, విద్యుత్ శాఖల సమన్వయంతో రథోత్సవాన్ని నిర్వహించాలన్నారు. హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, వీరభద్రస్వామి ఆలయ ఈవో రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వాసు, రాయచోటి తహసీల్దార్ పుల్లారెడ్డి, విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా శాఖ, రహదారులు, భవనాలశాఖ, ఎక్సైజ్‌శాఖ, విద్యుత్‌శాఖ, అగ్ని మాపక శాఖ, తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా...

- ఏడుగురు పంచాయతీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు


గురుగుపల్లి సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో జవహర్‌బాబు

గాలివీడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విధులకు డుమ్మా కొట్టిన ఏడుగురు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో జవహర్ బాబు తెలిపారు. బుధవారం సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో పలుచోట్ల సచివాలయం సిబ్బంది ముందస్తు అనుమతులు లేకుండా గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో వివిధ సచివాలయాలకు సంబంధించి గైర్హాజరైన వారు రసూల్‌బాషా (పంచాయతీ కార్యదర్శి పూలుకుంట- ఈనెల 3 నుంచి గైర్హాజరు సచివాలయం మూసివేశారు), జె.మదన్‌మోహన్ (పంచాయతీ కార్యదర్శి గుండ్లచెరువు, డిసెంబరు 28 నుంచి అనుమతి లేకుండా గైర్హాజరు), ఎ.భార్గవి వీఆర్‌వో (పూలుకుంట, అరవీడు- ఈనెల 1 నుంచి అనుమతి లేకుండా గైర్హాజరు, సర్వేల పట్ల నిర్లక్ష్యం), పి.జ్యోతి (జీఎంఎస్‌కే, పూలుకుంట- నవంబరు 30 నుంచి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు), కె.లావణ్య (ఇంజనీరింగ్ అసిస్టెంట్, పూలుకుంట- డిసెంబరు 20 నుంచి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు), కేవీ సుధాకర్ (వీఆర్‌వో, గరుగుపల్లి- సర్వేలకు సహకరించడం లేదు), టీఎస్ యశోదమ్మ (వీఆర్‌వో, గుండ్లచెరువు- సర్వేలకు సహకరించడం లేదు) వీరు ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా సచివాలయాలను వదిలి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గైర్హాజరు కావడంతో రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆయన నోటీసుల్లో పేర్కొన్నారు.

లాభదాయకం.. ఉద్యానం

- ఏపుగా పెరిగిన చీనీ చెట్లు
- ఎకరాకు ఏడాదికి రూ.1.5లక్షల ఆదాయం

చాపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆలోచన మారుతోంది. ప్రతిఏటా వేసే పంటలతో వచ్చే అరకొర ఆదాయంతో విసుగుచెంది రైతులు పంటల మార్పిడికి శ్రీకారం చుడుతున్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటల సాగుతో రైతులు మంచి లాభాలు గడిస్తున్నారు. చాపాడు మండలంలో ప్రతి ఏడాది రైతులు కేసీకెనాల్, చాపాడు చానెల్, వ్యవసాయ ఫిల్టర్ల కింద వరి, పసుపు, నువ్వులు సాగు చేస్తుంటారు. కానీ కష్టానికి తగిన ఆదాయం లభించలేదని రైతులు ఉద్యానవన పంటలవైపు దృష్టి సారించారు. వెదురూరు, రాజుపాళెం, అనంతపురం, నరహరిపురం, నక్కలదిన్నె, రాజువారిపేట, సీతారామపురం, కేతవరం తదితర గ్రామాల రైతులు సుమారు 200 ఎకరాల్లో జామ, చీనీ మొక్కలు నాటారు. ఏడేళ్ల క్రితం నాటిన మొక్కలు ఏపుగా పెరిగి కాయలు కాసి మంచి పంట దిగుబడి ఇస్తున్నాయి. పంట దిగుబడి ఎక్కువగా ఉండడం, రేటు కూడా బాగుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పొలాల్లోనే కొనుగోలు

జామకాయలు, చీనీ పండ్లను తాడిపత్రి, మల్లేల, నంది మండలం ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి నగదు చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. జామ, చీనీ మొక్కలను నాటినా ఏడాది నుంచే కాపుకొస్తున్నాయి. మూడవ ఏడాది నుంచి దిగుబడి ఎక్కువగా ఉంటుందని రైతులు తెలిపారు. ఒక ఎకరాలో చీనీ పండ్లు ఆరు నెలల కాలంలో 42 టన్నుల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఒక టన్ను రూ.40 వేల నుంచి రూ.55 వేల వరకు ధర పలికిందన్నారు. ఒక ఎకరాకు ఖర్చులు పోను రూ.1.50 లక్షలు ఆదాయం మిగిలినట్లు ఓ రైతు తెలిపారు.

90 శాతం సబ్సిడీతో డ్రిప్

డ్రిప్ పద్ధతిలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. వీటికి పది టన్నుల పశువులపేడ, 150 కిలోల సింగిల్ సూపర్, పొటాష్, 15 కిలోల నత్రజని ఉపయోగిస్తున్నారు. అలాగే జీవామృతం నెలకు రెండుసార్లు ఎరువుగా వాడుతున్నారు. తిరుపతిలోని వ్యవసాయ యూనివర్శిటీకి చెందిన శాస్త్రవేత్తలు శ్రీనివాసులరెడ్డి, మహిళా శాస్త్రవేత్త ముకుంద ఈ పంటలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఈ చెట్ల వేర్లకు కుళ్లు తెగుళ్లు రాకుండా ట్రైకోడెర్మా, సూడోమొనాస్ అనే మందులు వాడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో ఇచ్చిన డ్రిప్ పరికరాలు, పైపులతో ప్రతి చెట్టుకు నీటిని అందించేందుకు రైతులకు సులభంగా ఉంది. మొత్తానికి చెట్లు ఏపుగా పెరిగి మంచి దిగుబడి ఇస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ఏపుగా పెరిగిన చెట్లలో కాయలు, పూతను చూపుతున్న రైతు శివారెడ్డి


డ్రమ్ముల్లో ఉన్న జీవామృతం

చీనీ చెట్లతో మంచి ఆదాయం

పది ఎకరాల్లో జంబోరా రకం చీనీ తోట వేశాను. ఏడు సంవత్సరాల క్రితం ఈ మొక్కలు నాటాను. ఇప్పుడు బాగా పెరిగి పంట దిగుబడి వస్తోంది. ఎకరాకు 40 నుంచి 45 టన్నుల చీనీ పండ్లు పండుతున్నాయి. ఏడాదిలో రెండుసార్లు కోతకు వస్తున్నాయి. ఏడాదికి ఎకరాకు రూ.1.50 లక్షల ఆదాయం వస్తోంది. ఇంతకుమునుపు వేరుశనగ, వరి సాగు చేసేవాడిని. ఆ పైర్లు గిట్టుబాటు కాకపోవడంతో చీనీ సాగు చేశాను. చీనీ చెట్లకు జీవామృతం, పశువుల పేడ ఎక్కువగా వాడుతున్నాను. డ్రిప్ పద్ధతిలో నీరందిస్తున్నా. తిరుపతిలోని వ్యవసాయ యూనివర్శిటీ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తున్నా.

- లోమడ శివారెడ్డి, రైతు, వి.రాజుపాళెం గ్రామం

వివాదాస్పదమైన నిర్మాణాల నిలిపివేత

- రెవెన్యూ అధికారుల తీరుపై అనుమానాలు


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న తహసీల్దారు, మండల సర్వేయర్, తదితరులు

పీలేరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం నాగిరెడ్డి కాలనీలో బుధవారం జరిగిన ఓ ఇంటి నిర్మాణ పనుల నిలిపివేత వివాదాస్పదంగా మారింది. నిర్మాణదారుల వద్ద ఉన్న పత్రాలకు, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న వివరాలకు సరిపోవడం లేదని నిర్మాణ పనులను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. అయితే ఈ నెల 2వ తేదీన ఆ పత్రాలు సరైనవేనని రెవెన్యూ అధికారులే ధ్రువీకరించినట్లు తేలడంతో వివాదం ఏర్పడింది. కేవలం పది రోజుల వ్యవధిలో తమ పత్రాలు ఎలా తారుమారు అవుతాయని నిర్మాణదారులు ప్రశ్నిస్తుండడంతో రెవెన్యూ అధికారుల వ్యవహారశైలిపై అనుమానాలకు తెరలేపింది.

పీలేరు పట్టణం కోటపల్లెకు చెందిన ఓ.కళావతమ్మ, సి.గీతలకు నాగిరెడ్డి కాలనీలోని సర్వే నెం.72/2లో అప్పటి రెవెన్యూ అధికారులు 2014లో ఇంటి నివేశన పట్టాలు మంజూరు చేశారు. తమకు కేటాయించిన ఆ స్థలంలో పట్టాదారులు రెండు రోజులుగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ నిర్మాణాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో పీలేరు రెవెన్యూ అధికారులు బుధవారం స్థల పరిశీలన జరిపారు. నిర్మాణదారులు అందజేసిన పట్టాలకు, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న పట్టాలకు సరిపోవడం లేదని తెలియజేస్తూ బుధవారం మధ్యాహ్నం పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు, మండల సర్వేయర్ కిరణ్మయి తమ బృందంతో నిర్మాణ పనులు ఆపివేశారు. ఆ స్థలం ప్రభుత్వానిదని, అందులో ఎటువంటి నిర్మాణాలు చేయకూడదని ఒక హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. అయితే తమకు అక్కడ 2014లో ఇంటి నివేశన పట్టాలు మంజూరు చేశారని, ఆ పట్టాలు సరైనవేనని గతంలో రెవెన్యూ అధికారులు సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన సమాచారం మేరకు లిఖిత పూర్వకంగా తెలియజేశారని పట్టాదారులు తెలిపారు. ఈ నెల 2న కూడా ప్రస్తుత మండల సర్వేయర్ సర్వే చేసి సర్వే నెం.72/2లో ఇంటి పట్టాలు ఉన్నాయంటూ నిర్ధారించారని తెలిపారు. కేవలం 10 రోజుల వ్యవధిలో రికార్డులు ఎలా మారిపోతాయని ఆయన ప్రశ్నించారు. రాజకీయ కారణాలతో రెవెన్యూ అధికారులు తమ నిర్మాణాలను ఆపివేశారని, తాము నిర్మాణాలు ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ సంఘటన బుధవారం పీలేరులో చర్చనీయాంశమైంది. నిర్మాణాలు కొనసాగుతున్న విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గురువారం చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ వివాదం ఏ మలుపు తీసుకుంటుందో వేచి చూడాలి.


హెచ్చరిక బోర్డు తొలగించి పనులు చేసుకుంటున్న నిర్మాణదారులు

సోలార్ వెలుగులు

- జోరుగా సాగుతున్న విద్యుత్తు ప్లాంట్ పనులు
- పనులు పూర్తయితే వెయ్యి మెగా వాట్ల విద్యుత్తు ఉత్పత్తి

మైలవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వద్దిరాల, దొడియం, నక్కవానిపల్లె గ్రామాల కొండ ప్రాంతాల్లో 750 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ పనులు జోరుగా సాగుతున్నాయి.

సోలార్ ప్యానెళ్లను అమర్చుతున్న కూలీలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్తు ప్లాంట్ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఆదానీ సంస్థ 250 మెగావాట్లు, స్వింగ్ కంపెనీ 250 మెగావాట్లు, హయ్యానా సంస్థ 250 మెగావాట్లతో విద్యుత్తు ప్లాంట్ పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు 2,500 కోట్లకుపైగా పెట్టుబడులతో చురుగ్గా ప్యానెల్, కార్నల్ తదితర పనులు సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే మైలవరంలో మొత్తం వెయ్యి మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది.

వైసీపీ హయాంలో నిలిచిన పనులు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సోలార్ పనులు నిలిచిపోయాయి. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ హయాంలో తలమంచిపట్నం, రామచంద్రాయపల్లె, పొన్నంపల్లె గ్రామాల మధ్య కొండ ప్రాంతంలో 250 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ పనులు పూర్తయి విద్యుత్తు ఉత్పత్తి అయ్యేందుకు అప్పటి ప్రభుత్వం కృషి చేస్తే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలిన 750 మెగావాట్ల విద్యుత్తు పనులు చేయడంలో నిర్లక్ష్యం చేశారు. వైసీపీ హయాంలో పనులు నత్తనడకన నడిచాయని స్థానికులు చెబుతారు. 2024లో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో 750 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ పనులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పనులు చకచకా సాగుతున్నాయి. ప్యానల్ పనులు, రోడ్లు,

సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసిన దృశ్యం



విద్యుత్తు, వైరింగ్, తదితర పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆదానీ, స్వింగ్, హయానా 750 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇది కూడా జూన్, జూలై చివరికల్లా సోలార్ విద్యుత్తు ప్లాంట్ పనులు పూర్తయి విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు.

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ ప్రాజెక్టు

మైలవరంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు అవసరమైన నెట్‌వర్క్‌కు బదులు 400 మెగ్గావాట్ల సామర్థ్యంతో బ్యాటరీ, స్టోరేజీ ప్రాజెక్టు ప్రతిపాదించారు. దొడియం గ్రామం వద్ద అతి పెద్ద అల్ట్రా సోలార్ ప్రాజెక్టు నిర్మాణం అవుతోంది. దీంతో మైలవరంలో సోలార్ వెలుగులు వెలుగనున్నాయి.

కనులపండువగా శ్రీవారి బ్రహ్మరథోత్సవం



రథోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో శ్రీవారి బ్రహ్మరథోత్సవం కన్నులపండువగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం 10.30గంటల సమయంలో పద్మావతి సమేత కళ్యాణవేంకటరమణస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రథంపై శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కొలువుదీరారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రథంపై కొలువుదీరిన స్వామివారిని భక్తులు దర్శించుకొని కాయకర్పూరం సమర్పించారు. అనంతరం బ్రహ్మరథాన్ని ముందుకు కదిలించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి రథాన్ని లాగారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శనలు, భజనలు అలరించాయి. శ్రీవారి రథోత్సవం పాతబస్టాండ్ నుంచి పూలంగళ్ల మీదుగా నిర్వహించగా.. అడుగడుగునా భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కుకున్నారు. ఈసందర్భంగా గోవిందన్నామస్మరణలతో పులివెదుల పట్టణం మారుమోగింది. సీఐ నరసింహులు, ఎస్ఐ నారాయణ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

10 మంది జూదరులు అరెస్టు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ జ్యోతినగర్‌లో జూదం ఆడుతున్న 10మంది పేకాటరాయుళ్లను బుధవారం త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.50,520 నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో రమణారెడ్డి, మద్దిలేటిరెడ్డిలతో పాటు మరో 8 మంది వున్నారు. వీరిపై త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

గ్యాస్ లీకేజీతో రూ.2లక్షలు ఆస్తినష్టం



మంటలను ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

బి.కోడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజుపాలెం గ్రామానికి చెందిన బొడుకొండు తిరుపాల్‌రెడ్డి ఇంటిలో గ్యాస్ లీకేజీ కావడంతో మంటలు ఎగిసిపడటంతో ఇంటిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. బుధవారం ఉదయం ఇంటిలో గ్యాస్‌పై వంట చేస్తుండగా సిలిండరు లీకేజీ కావడంతో మంటలు వ్యాపించాయి. ఫైరింజనుకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే ఇంటిలో ఉన్న బీరువా, ఫ్రిజ్, టీవీ తదితర వస్తువులన్నీ కాలిబూడిద య్యాయని వాపోయారు. ఈసంఘనటపై ఎస్ఐ సీపీ రాజు విచారిస్తున్నారు.

కోడిపందెంరాయుళ్లు అరెస్టు

సికెదిన్నె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళంపల్లె సమీపంలో బుధవారం కోడిపందెంరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీకేదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. గ్రామ సమీపంలోని కంపచెట్లలో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి మూడు కోడిపుంజులు, రూ.750 నగదు, 8 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నీళ్లట్యాంకర్ బోల్తా.. యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి

కొండాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాయపల్లె గ్రామానికి చెందిన విశ్వనాథ్(15) అనే యువకుడు బుధవారం నీళ్లట్యాంకర్ బోల్తాపడి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రాగికుంట వద్ద నున్న ఆదానీ కంపెనీకి తిరుమలాయపల్లె నుంచి విశ్వనాథ్ ట్రాక్టర్ నీళ్లట్యాంకర్ తీసుకెళుతుండగా మలుపులో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో విశ్వనాథ్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. మైనర్‌కు ట్రాక్టర్ ఇచ్చినందుకు ట్రాక్టర్ ఓనర్‌పై కూడా కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేరుశనగ పైరుకు నిప్పు

గాలివీడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పైరుకు నిప్పంటించారని మండల పరిధిలోని పూలుకుంట హరిజనవాడకు చెందిన వర్ల నారాయణమ్మ బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 699 బీ2లో రెండు ఎకరాల్లో తాను వేరుశనగ పైరు సాగు చేశానని, ఈ భూమికి వేసిన కంచెకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పైరు కాలిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వైభవం కుంభాభిషేకం

- వేడుకగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుని కల్యాణం
- ముగిసిన బ్రహ్మోత్సవాలు



తాళిబొట్టు చూపెడుతున్న వేద పండితులు

వల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పాపాఘ్ని నదీ తీరాన పైడికాల్వలో కొలువైన రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ బ్రహ్మోత్సవాల్లో కుంభాభిషేకం వైభవంగా సాగింది. బుధవారం ఉదయాన్నే సుప్రభాత సేవ, అనంతరం కలశ ఆవాహన చేసి కలశానికి ఉద్వాసన తెలిపారు. అనంతరం దాదాపు 108 రకాల సుగంధ ద్రవ్యాలతో మహాపూర్ణాహుతి నిర్వహించి యజ్ఞం వేసి ప్రధాన అర్చకులు హరినారాయణశర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి గావించారు. అనంతరం కుంభాభిషేకం మంగళవాయిద్యాల నడుమ మూల విరాట్టు రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ ఆలయ పరిదేవతలందరికీ కుంభాభి షేకం వేద పండితులు శాస్త్రోక్తంగా చేపట్టారు.

కల్యాణం వైభోగమే

బ్రహ్మోత్సవాల అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ మూలవిరాట్టును సుందరంగా అలంకరించి కోలాటాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. కంకణ ధారణతో కన్యాదానం నిర్వహించారు. తరువాత స్వామివారికి పాద ప్రక్షాళన గావించి జీలకర, బెల్లం ఆ దేవదేవేరుల శిరస్సుపై ఉంచారు. అనంతరం మాంగల్యం తంతునానేనా లోకరక్షణ హేతునా అంటూ శ్రీదేవి భూమి మెడల్లో చెన్నకేశవస్వామి మాంగల్యాన్ని అలంకరించారు. ముత్యాల తలంబ్రాలను శిరస్సుపై పోశారు. ఆలయ ప్రధానార్చకులు హరినారాయణశర్మ ఆధ్వర్యంలో మహామంగళహారతి గావించారు. భక్తులకు తీర్థ, అన్న ప్రసాదాలు అందించారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో వల్లూరు నుంచే కాక కడప, అన్నమయ్య, అనంతపురం తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు పాల్గొని బ్రహ్మోత్సవాలు తిలకించారు.

రుయా నేత్రనిధికి కళ్లు దానం



లీలావతి కళ్లను దానం చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రాన్ని టెక్నీషియన్‌కు అందజేస్తున్న ఆమె కుటుంబసభ్యులు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ మృతిచెందిన లీలావతి(61) కళ్లను ఆమె కుమారుడు సిద్ధారెడ్డి రుయాస్పత్రిలోని నేత్రనిధికి దానం చేశాడు. కడప జిల్లా చియ్యపాడుకు చెందిన లీలావతి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు రుయాస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె బుధవారం మృతిచెందారు. దీంతో విషయం తెలుసుకున్న కంటి విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులకు కళ్ల దానం చేయడం వల్ల చూపులేని మరొకరికి కంటి వెలుగు ప్రసాదించే అవకాశం ఉంటుందంటూ అవయవదానంపై అవగాహన కల్పించారు. లీలావతి కుమారుడు సిద్ధారెడ్డి తన తల్లి కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఆయన అనుమతితో నేత్ర విభాగ టెక్నీషియన్ రమేష్ సహకారంతో మృతురాలి కళ్లను సేకరించి రుయాస్పత్రిలోని నేత్రనిధిలో భద్రపరిచారు. తల్లిని కోల్పోయిన దుఃఖంలోనూ ఆమె కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చిన సిద్ధారెడ్డిని వారి కుటుంబ సభ్యులను రుయా అధికారులు అభినందించారు. ఈసందర్భంగా కంటి విభాగాధిపతి చలపతిరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా మృతిచెందితే సకాలంలో వారి కళ్లను దానం చేయడం వలన కంటి చూపులేని మరొకరికి కంటి వెలుగు ప్రసాదించవచ్చన్నారు. కళ్లను దానం చేయాలనుకునే వారు రుయాస్పత్రిలోని నేత్రనిధిని సంప్రదించాలన్నారు.

రిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స



శస్త్ర చికిత్స అనంతరం కణితిని చూపుతున్న వైద్య బృందం

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కడప సర్వజన ఆసుపత్రి రిమ్స్‌లో రాయచోటికి చెందిన వ్యక్తికి అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. రాయచోటికి చెందిన వ్యక్తి కడుపు ఉబ్బరం మరియు కడుపునొప్పితో బాధపడుతూ రిమ్స్‌కు వచ్చారు. సదరు వ్యక్తిని డాక్టర్లు పరీక్షించి కడుపులో పెద్ద కణితి ఉందని నిర్ధారించారు. శస్త్రచికిత్స విభాగాధిపతి డాక్టర్ వాణి ఆధ్వర్యంలో వైద్య బృందం రెండు గంటలపాటు శ్రమించి సుమారు ఆరు కేజీల కణతిని తొలగించినట్లు వైద్య బృందం తెలిపారు. ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్స చేసినందుకు డాక్టర్ వాణి, వైద్య బృందం, మత్తు వైద్య బృందాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ ఈ సందర్భంగా అభినందించారు.

జాతీయస్థాయిలో రిమ్స్ వైద్య విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని హర్షిణిని అభినందిస్తున్న వైద్య బృందం

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గత డిసెంబర్‌లో జాతీయస్థాయిలో ఆగ్రాలో జరిగిన శస్త్రచికిత్స అవగాహన సదస్సులో కడప రిమ్స్ జనరల్ సర్జరీ వైద్య విద్యార్థిని డాక్టర్ యు.హర్షిణి అద్భుత ప్రతిభ కనబరిచారు. జనరల్ సర్జరీ విభాగంలో మూడో సంవత్సరం చదువుతున్న పీజీ విద్యార్థిని మొదటి బహుమతి కైవసం చేసు కున్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని శస్త్రచికిత్స విభాగాధిపతి డాక్టర్ వాణి, ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ అభినందించారు.

ఏఎన్ఎంలకు పదోన్నతులు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఎంపీహెచ్‌డబ్ల్యు (ఎఫ్) పదోన్నతులు కల్పిస్తూ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నాగరాజు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో ఉమ్మడి జిల్లాల పరిధిలో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న 141 మందికి మెరిట్ ప్రాతిపదికన ఎంపీహెచ్‌డబ్ల్యు(ఎఫ్)లుగా పదోన్నతులు పొందారు. ఈ కమిటీలో జడ్పీసీఈఓ ఓబులమ్మ, మున్సిపల్ కమిషనరు మనోజ్‌రెడ్డి, డీపీఓ, సూపరింటెండెంట్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ



దువ్వూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన శ్రీశాంత్‌రెడ్డి రైతు బిడ్డ. ఈ విద్యార్థి చదువులో దిట్ట. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.27 మార్కులు సాధించి తన ప్రతిభను చాటాడు. త్వరలో జరుగబోయే అడ్వాన్స్ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీలో సీటు సాధిస్తారనే విద్యార్థి తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేశారు.

నేత్రపర్వం...శ్రీవారి చక్రస్నానం



వసంతోత్సవంలో స్వామిని ఊరేగిస్తున్న వేదపండితులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన శ్రీవారి చక్రస్నానం బుధవారం భక్తుల కోలాహలం మధ్య వైభవంగా జరిగింది. టీటీడీ వేదపండితులు వేకువజామునే శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించి నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా వసంతోత్సవం నిర్వహించి, స్వామి వారిని ఆలయ మాడ వీధుల్లో వైభవంగా ఉరేగించారు. భక్తులు అడుగడుగునా స్వామి వారికి కర్పూర హారతులు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తదనంతరం ఆలయ వాహన మండపంలో వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవీ, భూదేవి సమేత ఉత్సవమూర్తులకు, శ్రీవారి సుదర్శన చక్రతాళ్వార్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గంగాళంలోని జలంలో ముంచి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం పైకి సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ఆరంభంలో ఎగురేసిన గరుడ ధ్వజపటాన్ని అవరోహణం గావించారు. గురువారం ఉదయం శ్రీవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం పుష్పయాగంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఉపప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టర్, అర్చకులు రమేష్ స్వామి టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలుజాతి ఆవుకు కవల దూడలు



సికెదిన్నె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలుజాతి ఆవుకు ఒకేసారి రెండుదూడలు జన్మించినట్లు వేపమానుసత్రం గ్రామానికి చెందిన రైతు క్రిష్ణానాయక్ తెలిపారు. ఈ ఆవు 15 ఈతలు ఈనిందని, గతంలోనూ ఈ ఆవుకు కవల దూడలు జన్మించాయన్నారు. పశువైద్యులు నాగరాజు, సహాయకులు కిశోర్ ఆధ్వర్యంలో ఈ ఆవుకు గర్భధారణ చేశారు. బుధవారం ఆవుకు రెండు లేగదూడలు పూర్తి ఆరోగ్యంగా జన్మించడంతో హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యతే ప్రామాణికంగా దరఖాస్తులను పరిష్కరించండి

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాణ్యతే ప్రామాణికంగా పీజీఆర్ఎస్ దరఖాస్తు లను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మదనపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు 6 నుంచి జనవరి 8 వరకు మండలం లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భాగంగా భూసమస్యలపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారం ప్రగతిపై తహసీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో వచ్చిన సమస్యలు ఏన్ని పరిష్కారం జరిగాయి.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.. ఎందుకు పరిష్కారం అందించలేకపోయారో తహసీల్దార్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పీజీఆర్ఎస్‌లో 11వేల దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ఇప్పటికి ఐదు వేలు దరఖాస్తులకు పరిష్కారం అందించారని తెలిపారు. మిగిలిన దరఖాస్తులు అత్యంత నాణ్యతతో వేగంగా కచ్చితత్వంతో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఐవీఆర్ఎస్ ద్వారా నేరుగా దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది మీ దగ్గరకు వచ్చారా, మీ సమస్య పరిష్కారం అయిందా, క్షేత్ర స్థాయిలో విచారణ చేస్తున్నారా అని ప్రశ్నలు వేస్తున్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జిల్లాలో భాగా వెనకబడిన మండలాల్లో మదనపల్లె కూడా ఒక్కటన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో వెనకబడి ఉన్న వీఆ ర్వోలను వెంటనే మండలంలోని వివిధ ప్రాంతాలకు పంపాలని తహసీల్దార్‌కు సూచించారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేసి నాణ్యతతో పరిష్కారం చేయడమే ధ్యేయం కావాలన్నారు. ఇంకను పెండింగ్‌లో ఉన్న వాటిని ఎస్ఎల్ఏ పరిధి లోగా పరిష్కరించాలన్నారు. వచ్చిన అర్జీల్లో మ్యూటేషన్, అసైన్మెంట్, ఆర్ఓఆర్, భూ సేకరణ, దారిసమస్యలు, అన్నదమ్ముల భాగపరిష్కారాలు, సివిల్ కేసులు తదితరాలపై సమీక్షించి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో ప్రభుత్వ భూములు ఎక్కడైనా అక్రమణ జరిగినట్లు గుర్తిస్తే వెంటనే తొలగించి స్వాధీనం చేసుకోవాలన్నారు. సమావేశంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, తహసీల్దార్ ధనంజయులు, ఆర్ఐ శేషాద్రిరావు, మండల సర్వేయర్ రెడ్డి శేఖర్, వీఆర్వోలు, విఆర్ఏలు పాల్గొన్నారు.

అడవిని కాపాడడం మనందరి బాధ్యత



నిమ్మనపల్లి ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అడవిని కాపాడి అందులోని వన్యప్రాణులను రక్షించడం మన అందరి బాధ్యత అని ఎఫ్ఎస్‌వో సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నూరుకుప్పలకొండ బీట్‌లోని ఎర్రప్పగారిపల్లిలో ప్రజలకు అడవిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ మూగజీవాలను అడవికి తోలేవారు ఎట్టి పరిస్థితిలోనూ బీడీలు, సిగరెట్ తాగరాదని తెలిపారు. ఒక వేళ బీడీ తాగి నిప్పు వేస్తే అడవికి అగ్గి రాచుకొని వన్యప్రాణుల మరణిస్తాయన్నారు. ఇలాంటి పనులు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే వన్యప్రాణులను వేటాడడం చట్ట రీత్యా నేరమని తెలిపారు. ప్రతిఒక్కరూ అటవీ శాఖ అధికారులకు సహకరించి అడవిని కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో శోభ, ఏబీవో హరికృష్ణ, ప్రజలు పాల్గొన్నారు.

కోడెదూడ విక్రయంపై విచారణ

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మల్లయ్యకొండ దేవస్థానంలో కోడెదూడ విక్రయంపై బుధవారం పోలీసులు విచారణ చేశారు. తంబళ్లపల్లె మల్లయ్యకొండకు దాతలు పశువులను దానంగా ఇస్తుంటారు. అలా వచ్చిన ఓ కోడె దూడ అందరిపై దాడి చేస్తోందని భక్తుల నుంచి ఫిర్యాదులు రావడంతో దాన్ని విక్రయించారు. అయితే ఎవరి అనుమతి లేకుండా ఏకపక్ష నిర్ణయంతో విక్రయించారని ఆరోపిస్తూ స్థానిక టీడీపీ నాయకులు పురుషోత్తం, వీరాంజనేయులు, వెంకట్రమణ ఈవోపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ లోకేష్‌రెడ్డి, ఈవో మునిరాజుతో పాటు ఫిర్యాదుదారులతో విచారణ చేశారు. కొండకు వచ్చే భక్తులపై కోడెదూడ దాడి చేస్తుండడంతో దానికి బదులుగా రెండు, మూడు రోజుల్లో ఇంకొకటి తెస్తామని ఆలయ ఈవో తెలిపారు. ఇకమీదట దేవదాయశాఖకు సంబంధించిన ఆదాయ వనరుల లెక్కలు, జమా, ఖర్చులపై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా రికార్డు మెయింటెన్ చేస్తూ అందరి సూచనలతో చేపట్టాలని ఈవోకు ఎస్ఐ సూచించారు.

ఆటో బోల్తా.. విద్యార్థులకు గాయాలు


ఎర్రమిట్ట వద్ద బోల్తాపడిన ఆటో, ప్రమాదంలో గాయపడిన సాహితి

గుర్రంకొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ముగ్గురు విద్యార్థులకు రక్తగాయాలైన సంఘటన ఎర్రమిట్టవద్ద బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని సరిమడుగు పంచాయతీ పూల్లవాండ్లపల్లెకు చెందిన ఎం.సాహిత(13), కే.విష్ణు(13), స్వాతి(14)లు గుర్రంకొండ తెలుగు జడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కె.అరుణ్(17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పాఠశాల, కళాశాల వదలడంతో ఆటోలో గుర్రంకొండ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో వీరు ప్రయాణిస్తున్న ఆటో ఎర్రమిట్ట వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సాహితి, అరుణ్, నానీలకు రక్తగాయాలు కాగా స్వాతికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులకు గుర్రంకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులు ప్రత్యేక గుర్తింపు కార్డు కోసం నమోదు చేసుకోవాలి


నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీ శివశంకర్

నిమ్మనపల్లి ఫిబ్రవరి 12(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ప్రతి రైతు తప్పనిసరిగా ప్రత్యేక గుర్తింపు కార్డును తీసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం కొండయ్యగారిపల్లి పంచాయతీలోని కొమ్మిరెడ్డిగారిపల్లిలో ప్రత్యేక గుర్తింపు కార్డుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆధార్, అపార్ కార్డును మంజూరు చేసిన విధంగానే రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డు(యూనిక్ ఐడెంటిటీ కార్డు) జారీ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చాయన్నారు. 11 అంకెలతో ఒక రైతుకు ఒకే కార్డును నమోదు చేసి పంపిణీ చేస్తామన్నారు. దీని వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రుణమాఫీ, పీఎం కిసాన్, సుఖీభవ వంటి పథకాలతో పాటు సబ్సిడీతో ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రాజశేఖర్, శ్రీకాంత్, జబ్బార్, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం


పురవీధులలో ఊరేగుతున్న శ్రీలక్ష్మీజనార్దనస్వామి

రామసముద్రం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీజనార్దనస్వామి వారి రథసప్తమి వేడుకల్లో భాగంగా బుధవారం రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగింపు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. స్థానిక జనసేన నాయకులు, బలిజ కులస్తుల ఆహ్వానం మేరకు మదనపల్లి జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు రామసముద్రం విచ్చేసి స్వామివారికి విశిష్ట పూజలు నిర్వహించి, రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామసముద్రం మండల జనసేన నాయకులు కోలా హరి, జనార్దన్, పూల అంజప్ప, లక్ష్మీపతి, మంజునాథ్, బ్యాంక్ మంజునాథ్, సూరి, సూర్య లక్ష్మీనారాయణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారం వేగవంతం చేయండి

● హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర వెల్లడి


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై అధికారులకు రైతులు సమర్పించిన అర్జీల పరిష్కారానికి చర్యలను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం పెద్దతిప్పసముద్రం రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ రెవిన్యూ అధికారులు కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు లేకుండా ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వం నిర్దేశించిన రుసుము కంటే అధనంగా రైతుల వద్ద వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని, నిర్ణిత గడువులోగా రైతులు సమర్పించిన అర్జీలకు సంబంధించిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని, గ్రీవెన్స్‌లో అందిన అర్జీలు, కలెక్టర్ కార్యాలయం నుండి వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని, రైతుల భూమూల్లో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలలో తప్పులను వెను వెంటనే పరిష్కరించాలని, రెవిన్యూ అధికారులను ఆదేశించారు. రెవిన్యూ అధికారులపై రైతుల నుండి అనేక పిర్యాదులు అందుతున్నాయని, రైతులను రెవిన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని ఆయన తేల్చి చెప్పారు. రైతులు వివిధ సమస్యలపై రైతులను రెవిన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీరాములు నాయక్, డిప్యూటీ తహసీల్దార్ విద్యాసాగర్, ఆర్ఐ బాలాజీ, మండల సర్వేయర్ శ్రీవాణి, విఆర్‌వోలు రామకృష్ణ, అహ్మద్, లలితకుమారి, అమరనాథ్, అశోక్‌నాయక్, వెంకటేష్, హైదర్‌షా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

కలకడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని డీఏవో చంద్రానాయక్ అన్నారు. బుధవారం ఆయన కలకడ ఎంఏవో కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 6300 మంది పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నట్లు తెలిపారు. వీరందరూ ఈ నెల 28వ తేదిలోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఏవోలు లావణ్య, వెంకటమోహన్, సిబ్బంది శ్రావణ్‌కుమార్, అమృత్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నలవీరగంగాభవానీ అమ్మవారు

మదనపల్లెఅర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సీటీఎం నలవీరగంగాభవానీ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ ఆలయం ఆవరణలోని శిరిమానను పూలు, పసుపు, కుంకుమతో ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు చేశారు. వి.సుధాకర్‌రెడ్డి, మంజుల కుటుంబసభ్యులతో కలిసి తొలిపూజ శిరిమానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు సీటీఎం సర్పంచ్ సగినాల ఆనందపార్థసారధి, పారపట్ల సురేంద్రరెడ్డి, పోగాకు ప్రతాప్, వెలుగు చంద్ర, ప్రభాకర్‌రెడ్డి, వంశీ, అర్జున్, భక్తులు పాల్గొన్నారు.

వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలి

● రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ఆర్టీవో


బైకులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే ప్రమాదాల్లో ప్రాణ రక్షణ కల్పిస్తోందని ఆర్టీవో శివలింగ తెలిపారు. బుధవారం స్థానిక మిషన్ కాంపౌండ్ నుంచి హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీని ప్రారంభించి, మదనపల్లె పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పించారు. రవాణాశాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీవో శివలింగ, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ ప్రతాప్, హరి, ట్రాఫిక్ సీఐ మోహన్‌కుమార్, పోర్డు సంస్థ సభ్యులు అల్తాఫ్, పోలీసులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, 2019-2024 వరకు ఎన్నో అన్యాయాలు చూశామని, బీజేపీ రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుంబకర్ణుడి నిద్రలేచిన విధంగా ఎంపీ మిధున్‌రెడ్డి బడ్జెట్‌పై కొన్ని అంశాలు లేవనెత్తారని ఆరోపించారు. ఐదేళ్ల వైసీపీ అబద్దాలు, అసత్యాలతో పాలన కొనసాగించారన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో 475 కోట్లతో భూమి పూజ చేసి రెండేళ్ల కాలంలో కళాశాల పనులు పూర్తి చేస్తామని హామీలు ఇచ్చి ప్రస్తుతం దేనికి పనికిరాకుండా చేసిన ఘనత వైసీపీదే అన్నారు. 2029 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆనంద్, రవికుమార్, కృష్ణమూర్తి, పూలనాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు హక్కులు తెలుసుకోవాలి


పరిష్కార వేదికలో ప్రసంగిస్తున్న చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి

కలికిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకున్న హక్కులు గురించి ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్‌కు చెందిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి (రిటైర్డు జడ్జి) సూచించారు. బుధవారం స్థానిక విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సభలో ఆయన మాట్లాడారు. సమస్యల గురించి వేదిక దృష్టికి తీసుకువచ్చిన వాటికి సత్వర పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వినియోగదారుల నుంచి చెప్పుకోదగ్గ స్థాయిలో సమస్యలేవీ వేదిక ముందుకు రాలేదు. కేవీ పల్లె మండలం గోరంట్లపల్లెకు చెందిన రైతు జి.అశ్వినీకుమార్ గత ఏడాది అక్టోబరులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయి పెంచేందుకు రూ.21 వేలు చెల్లించినా ఇంతవరకు పని జరగలేదని చైర్మన్ దృష్టికి తెచ్చారు. అదే విధంగా కలికిరి మండలం కొటాల గ్రామానికి చెందిన మరో రైతు శివయ్య కొత్త వ్యవసాయ సర్వీసులు విడుదల చేయడంలో జాప్యం జరుగుతోందని చెప్పారు. కావలసిన సామగ్రి తగినంతగా అందుబాటులో లేని కారణంగా ఆలస్యం జరుగుతున్నదని స్థానిక విద్యుత్ అధికారులు సమాధానమిచ్చారు. ఫిర్యాదు చేసిన ఇరువురు రైతుల సమస్యలను నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి ఆదేశించారు. కార్యక్రమంలో పరిష్కార వేదిక సాంకేతిక సభ్యుడు ఎస్.ఎల్.అంజినీకుమార్, ఏపీఎస్పీడీసీఎల్ అన్నమయ్య జిల్లా ఎస్ఈ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, పీలేరు ఈఈ వై.చంద్రశేఖర్‌రెడ్డి, కలికిరి, పీలేరు డీఈఈలు ఎం.శివయ్య, జి.అమీర్‌బాషా, ఆరు మండలాల ఏఈఈలు, జూనియర్ ఇంజినీర్లు, డివిజన్‌లోని ఏఏవోలు, జేఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రికి అన్ని సౌకర్యాలు కల్పించాలి

● టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కూటమి నాయకులతో కలసి మల్లయ్యకొండను సందర్శించారు. తొలుత భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కొండపైన చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. నిర్మాణాలు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వైద్య సదుపాయం, క్యూ లైన్లలో చలువపందిళ్లు తదితర ఏర్పాట్లు చేయాలని ఈవో మునిరాజుకు సూచించారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో జయచంద్రారెడ్డితో పాటు, నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, కురబలకోట మండల కన్వీనర్ వైజీ సురేంద్ర శివమాల ధరించారు. తదనంతరం కూటమి నాయకులతో కలిసి మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, క్లస్టర్ ఇంచార్జి బేరిశీను, ఉత్తమ్‌రెడ్డి, పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ శివకుమార్, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, మాజీ మల్లయ్యకొండ చైర్మన్ గంగుల్‌రెడ్డి, నారాయణ, చాంద్‌బాష, ఆనంద్, జయపాల్‌నాయుడు, నరేంద్రనాయుడు, మధు, జనసేన సురేష్ తదితరులు పాల్గొన్నారు.


కొండపైన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జయచంద్రారెడ్డి

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నేషనల్ టెస్టు ఏజన్సీ వారం మంగళవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో వెంకటరెడ్డి శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా లెవల్‌లో అత్యుత్తమ ప్రతిభ సాధించి మదనపల్లె పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంతటి ఘన విజయానికి కారణమైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఇందులో బి.తనుశ్రీ 93.88 శాతం సాధించి మదనపల్లెటౌన్‌లో ప్రథమ స్థానంలో నిలవగా, దీప్యాసాయి 93.66 శాతం సాధించి ద్వితీయ స్థానం, మిథన్ హరిహరన్ 88.83 శాతంతో తృతీయ స్థానంలో, మహమ్మద్ సుహైల్ 85.38 శాతం, మోక్షజ్ఞారెడ్డి 80.30 శాతం సాధించారన్నారు. వీరితో పాటు 35 మంది విద్యార్థులు 80 శాతం పైగా సాధించి వెంకటరెడ్డి సిద్ధార్థ కళాశాలను అత్యున్నత స్థానంలో నిలిపారని ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, డైరెక్టర్ హేమంత్ తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు


ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ క్రిష్ణారెడ్డి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ వారు మంగళవారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీ కృష్ణారెడ్డి సిద్ధార్థ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా లెవల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం కళాశాల్లో విద్యార్థులకు స్వీట్స్ తినిపించి అభినందనలు తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించేందుకు కృషి చేసిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రలకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో సాయిసుదీక్ష 93.4845 శాతం, డి.పవన్‌తేజ్‌రెడ్డి 93.2899 శాతం, ఎస్.స్పందన 89.7748 శాతం, ఎ.వెంకటసాయి దీపక్ 88.2051 శాతం సాధించిన వారిలో ఉన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం అందించే రుణాల దరఖాస్తుకు ఈ నెల 15వ తేది వరకు పొడిగించినట్లు ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, ఈబీసీ, కాపు అనగా (కాపు, బలిజ, తెలగ, ఒంటరి) కులాలకు చెందిన లబ్ధిదారులు ఈ నెల 15న సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత మండల పరిషత్ కార్యాలయంలో పత్రాలు సమర్పించాలని ఆయన తెలిపారు.

రేపు మాజీ సీఎం కలికిరికి రాక

కలికిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం కలికిరి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1.10 గంటలకు హైదరాబాదు నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారని, అక్కడి నుంచి సాయంకాలం 3.15 గంటలకు నేరుగా కలికిరిలోని బీజేపీ కార్యాలయానికి రానున్నట్లు ఆయన వివరించారు. ఆ మరుసటి రోజు శనివారం స్థానిక కార్యక్రమాలకు హాజరైన అనంతరం బీజేపీ కార్యాలయంలో అందుబాటులో వుంటారని తెలిపారు.

భవన నిర్మాణ మేస్త్రీ మృతి

మదనపల్లెఅర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ అందులో నుంచి పడి భవన నిర్మాణ మేస్త్రీ మృతి చెందినట్లు తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం, చిప్పిలి గ్రామానికి చెందిన తిప్పన్న(60) భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం కూలీల కోసం బొమ్మనచెరువుకు ఆటోలో వెళుతుండగా చెంబకూరు రోడ్డులో హంద్రీనీవా కాలువ వద్ద గుంతలు ఉన్నా ఆటోడ్రైవర్ వెళ్లిన వేగానికి ఆటోలో నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తాలుకా సీఐ అక్కడికి వెళ్లి మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య గంగులమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ

కలకడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పథకం పనులపై గురువారం నుంచి సామాజిక తనిఖీ జరుగుతుందని ఎంపీడీవో అబ్దుల్‌రహీం తెలిపారు. బుధవారం ఆయన సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్పీ సుబ్బారావు మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరంలో మండలంలో జరిగిన 486 పనులకు గానూ రూ.7.47 కోట్ల పనులకు సంబంధించి నాలుగు బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై చర్యలు చేపట్టండి

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలపై ముందస్తు చర్యలు చేపట్టాలని ఇంచార్జ్ ఈవోపీఆర్డీ మునిమోహన్ కృష్ణ, ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్‌లు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకులు చేసిన పాపానికి మండలానికి చెందిన రైతులు నష్టపోయారు. గత వైసీపీ ప్రభుత్వంలో కేవలం వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు తప్ప ఇతర పార్టీలకు చెందిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల కష్టాలను గుర్తించి ఫిబ్రవరి 6న ఆంధ్రజ్యోతి సంచికలో "ట్రాన్స్‌ఫార్మర్ల కోసం నిరీక్షణ" అనే శీర్షికన ప్రచురితమవడంతో అధికారుల దృష్టికి కూటమి నేతలు తీసుకెళ్లారు. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు ఎట్టకేలకు బుధవారం మండల కేంద్రానికి సుమారు 60 ట్రాన్స్‌ఫార్మర్లను వివిధ గ్రామాలకు చెందిన రైతులకు సీనియారిటీ మేరకు తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ముఖ్యనేత జయచంద్రారెడ్డితో కలసి బుధవారం పంపిణీ చేశారు. ఇంకా వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన రైతులకు త్వరగా ట్రాన్స్‌ఫార్మర్లను అందించేందుకు చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏఈ రామలక్ష్మయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.